విశాఖపట్టణం
సోమవారం 14 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 213 వెల: రూ.5/-



పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు

వినాయక చవితి శుభాకాంక్షలు

పండుగ సందర్భంగా నేడు సెలవు.. మంగళవారం సంచిక వెలువడదు.. పునఃదర్శనం బుధవారం

పెద్దింటి సురేష్
MANAGING DIRECTOR
స్వాస్తికాశ్రీ పబ్లికేషన్స్

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# బ్రహ్మోత్సవాలకు తిరుమల ముస్తాబు

**ఈ ఏడాది అధికమాసంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు**

**14న రాత్రి నుంచి అంకురార్పణ**

**15 శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు**





**(తిరుమల - జయజయహే)**

కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రం శ్రీవారి వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం అన్ని విభాగాల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఏడాది అధికమాసం రావడంతో శ్రీవారికి రెండుసార్లు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఇందులో భాగంగా మొదటగా భాద్రపదంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అనంతరం అశ్వయుజంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ నెల 14న రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య శాస్త్రోక్తంగా అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అనంతరం 15న సాయంత్రం 6.21 నుంచి 6.35 గంటల మధ్య మీనలగ్నంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించనున్నారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు అత్యంత వైభవంగా సాగే ఈ ఉత్సవాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ..మిగతా 2లో




## వదంతులు నమ్మొద్దు..!

**ప్రైవేటు వాహనాలపై ఆంక్షలు లేవు**

**15 వేల వాహనాలకే అనుమతి అనేది అవాస్తవం**

**సోషల్ మీడియా ప్రచారం సరికాదు**

**తిరుమల తిరుపతి దేవస్థానం స్పష్టీకరణ**

**(తిరుమల - జయజయహే)**

తిరుమల క్షేత్రానికి సంబంధించి నిత్యం ఏదో ఒక విషయం హాట్ టాపిక్ అవుతోంది. కొన్నిసార్లు లడ్డూ నాణ్యతపై, కొన్నిసార్లు ఏర్పాట్లు, భక్తులకు ప్రసాదాలు అందడం లేదని, కొండ మీద మద్యం, మాంసం ఉంటున్నాయని టీటీడీ నిఘా వైఫల్యమంటూ విమర్శలు వస్తుంటాయి. తాజాగా తిరుమలలో ప్రైవేట్ వాహనాలపై ఆంక్షలు ఉన్నాయని కొందరు భక్తులు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. దీనిపై టీటీడీ క్లారిటీ ఇచ్చింది. తిరుమలకు చేరుకునే ప్రైవేటు వాహనాలపై తిరుమల తిరుపతి దేవస్థానం లాంటి ఆంక్షలు విధించలేదని స్పష్టం చేసింది. రోజుకు కేవలం 15 వేల వాహనాలను మాత్రమే తిరుమలకు అనుమతిస్తారని, ఆ సంఖ్య దాటిన తర్వాత వచ్చే వాహనాలను చెక్‌పాయింట్ల వద్ద నిలిపివేస్తారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని ..మిగతా 2లో

# బ్రిక్స్ కేవలం దేశాల కూటమి కాదు... పరిష్కారాల వ్యవస్థ

**బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ**

**ఢిల్లీ డిక్లరేషన్‌ను కాలపరిమితితో అమలు చేయాలని బ్రిక్స్ దేశాలకు మోదీ సూచన**

**బ్రిక్స్ ఇక కేవలం దేశాల కూటమి కాదని, పరిష్కారాల వ్యవస్థ అన్న ప్రధాని**




**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు తీసుకున్న నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలుగా మారాలని స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆమోదించిన డిక్లరేషన్, బ్రిక్స్ దేశాల ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం మధ్యాహ్నం మోదీ మరోసారి మాట్లాడారు. రెండు రోజుల పాటు ..మిగతా 2లో




## టెట్ ఫలితాలు రిలీజ్

**51 శాతం మంది ఇన్ సర్వీస్ టీచర్స్ ఉత్తీర్ణత**

**ఉత్తీర్ణులకు మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు**

**(అమరావతి - జయజయహే)**

ఏపీ టెట్-జూన్ 2026 ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల విడుదలను ఎక్స్ వేదికగా విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదివారం ప్రకటించారు. అధికారిక వెబ్‌సైట్ ఖజ్ఞాప్.ఖజూఎటం౦.అఅ లో అందుబాటులో టెట్ ఫలితాలు ఉంటాయని వివరించారు. 9552300009 వాట్సాప్ నంబర్ ద్వారా కూడా ఫలితాలు తెలుసుకునే అవకాశం ఉంఅలాగే 47 శాతం రెగ్యులర్ అభ్యర్థుల ఉత్తీర్ణత పొందారని చెప్పారు. ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు, ముఖ్యంగా ఇన్-సర్వీస్ టీచర్లకు మంత్రి లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. అర్హత సాధించని వారు నిరాశ చెంద వద్దని, విజయం అనేది ఓ ప్రయాణమని వారికి విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ సూచించారు. టెట్‌లో 51 శాతం మంది ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.



## ఇక ఫాస్టాగ్ పోర్టబులిటీ

**వాహనదారులకు కేంద్రం భారీ ఊరట**

**ఒకే స్టిక్కర్‌తో బ్యాంక్ మార్పు**

**కేంద్ర ప్రభుత్వం కసరత్తు**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

దేశంలోని కోట్లాది మంది వాహనదారులకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ భారీ ఊరట నిచ్చే శుభవార్త అందించారు. జాతీయ రహదారులపై టోల్ చెల్లింపుల కోసం ఉపయోగిస్తున్న ఫాస్టాగ్ విధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు వేరే బ్యాంకుకు మారాలంటే పాత ఫాస్టాగ్ తీసేసి కొత్త స్టిక్కర్ వేసుకోవాల్సి వచ్చేది, కానీ ..మిగతా 2లో

# కేంద్ర పథకాలతో నిధుల సేకరణ

**రూ. 25,304 కోట్ల ఆర్థిక సహాయం మంజూరు**




**(అమరావతి - జయజయహే)**

అభివృద్ధి, సంక్షేమ పథకాలు సజావుగా అమలయ్యేందుకు ఒక్కో రూపాయిని ఎలా సేకరించవచ్చో సర్కార్ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా వచ్చే నిధులకు, రాష్ట్ర వాటాను జతచేసి పలు కార్యక్రమాలు అమలుచేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళలు, శిశువులు, గర్భిణులకు ప్రయోజనం కల్పించే సంక్షేమ పథకాలతో పాటు పల్లెల్లో ప్రగతి పనులకు కేంద్ర పథకాల ద్వారా గరిష్ఠంగా నిధులు రాబడుతోంది. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో ఏపీలో 86 కేంద్ర ప్రాయోజిత పథకాలకు రూ.25,304 కోట్లు మంజూరు చేయించుకోగలిగింది. ఈ మొత్తం 2024-2025లో 14,109 కోట్లు, 2025-2026లో రూ.15,126 కోట్లు ..మిగతా 2లో



## నడిసంద్రంలో మునిగిన నౌక

2

**242 మంది గల్లంతు**

**100 మందిని రక్షించినట్లు ప్రకటించిన ప్రభుత్వం**

For a pure tomorrow..
జయహో

# బ్రిక్స్ కేవలం దేశాల కూటమి కాదు... పరిష్కారాల వ్యవస్థ




**మొదటి పేజీ తరువాయి...**

జరిగిన చర్చలు బ్రిక్స్‌పై తమ నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు. బ్రిక్స్ కేవలం కొన్ని దేశాలు కలిసి పనిచేసే వేదిక మాత్రమే కాదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు వెతికే వ్యవస్థగా మారుతోందని పేర్కొన్నారు.

**ఫలితాలు కనిపించాలి!**

బ్రిక్స్ సదస్సులో తీసుకున్న నిర్ణయాలను ఇకపై కాలపరిమితితో అమలు చేయాల్సిన అవసరం ఉందని మోదీ స్పష్టం చేశారు. నిర్ణయాలు, ప్రకటనలు కేవలం ఫైళ్లలో ఉండిపోకూడదని, ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా వాటిని అమలు చేయాలని అన్నారు. చివరి స్థాయిలోనూ ఫలితాలు కనిపించేలా కలిసి పనిచేయాలని బ్రిక్స్ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచం ఇప్పుడు బ్రిక్స్ నుంచి కేవలం ఆలోచనలు, హామీలను మాత్రమే ఆశించడం లేదని అన్నారు. స్పష్టమైన ఫలితాలను కోరుకుంటోందని, బ్రిక్స్ మూడో దశాబ్దంలోకి అడుగుపెడుతున్న సమయంలో ఈ అంచనాలను అందుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. కీలక ఖనిజాలు, సరఫరా వ్యవస్థల విషయంలో బ్రిక్స్ దేశాల మధ్య సహకారం మరింత పెరగాల్సిన అవసరం ఉందని మోదీ చెప్పారు. బ్రిక్స్ లాజిస్టిక్స్ సప్లై చైన్ కోఆపరేషన్ ఫ్రేమ్‌వర్క్ ద్వారా సరఫరా వ్యవస్థలను మరింత నమ్మకంగా, బలంగా మార్చుకోవచ్చని తెలిపారు. కీలక ఖనిజాలు ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చాలా ముఖ్యమైనవిగా మారుతున్నాయని అన్నారు. ఇంధన భద్రతతో పాటు తక్కువ కాలుష్యంతో కూడిన సాంకేతికతల అభివృద్ధిలో వీటి పాత్ర కీలకమని చెప్పారు. వనరులు ఉన్న దేశాల హక్కులను గౌరవిస్తూ సరఫరా వ్యవస్థలను నమ్మకంగా, వైవిధ్యంగా, స్థిరంగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**టెక్నాలజీ విషయంలో అందరికీ అవకాశం!**

టెక్నాలజీ, కీలక ఖనిజాలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం బ్రిక్స్ దేశాల ఉమ్మడి అభివృద్ధికి అడ్డంకిగా మారే అవకాశం ఉందని మోదీ హెచ్చరించారు. సాంకేతికతను అందిపుచ్చుకునే విషయంలో అందరికీ సమాన అవకాశాలు ఉండాలని అన్నారు. ఇదే సమయంలో కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్ ద్వారా స్టార్టప్‌లు, ఇంక్యుబేటర్లను అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. కొత్త ఆలోచనలు, పెద్ద స్థాయిలో అమలు చేయగల పరిష్కారాలను ప్రోత్సహించేందుకు బ్రిక్స్ స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్‌ను ప్రతిపాదించినట్లు వెల్లడించారు.

వ్యవసాయ రంగంలోనూ టెక్నాలజీని మరింత సమర్థంగా ఉపయోగించుకునేలా బ్రిక్స్ నెట్‌వర్క్ ఆన్ డిజిటల్ అగ్రికల్చర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు మోదీ తెలిపారు. కృత్రిమ మేధ, భౌగోళిక సాంకేతికత, డిజిటల్ మౌలిక వసతులను రైతుల అవసరాలకు అనుగుణంగా ఉపయోగించుకోవడమే దీని లక్ష్యమన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల్లో బ్రిక్స్‌పై నమ్మకం పెరుగుతోందని మోదీ చెప్పారు. ఆయా దేశాల గొంతుకను వినడం, వారి అనుభవాలను గౌరవించడం, వారికోసం మాత్రమే కాకుండా వారితో కలిసి పరిష్కారాలను రూపొందించడం వల్లే ఈ నమ్మకం పెరిగిందన్నారు.

**బ్రిక్స్ బలం వైవిధ్యంలోనే!**

వేర్వేరు దేశాలు, వేర్వేరు పరిస్థితులు ఉన్నప్పటికీ సహకారంతో ముందుకు సాగడమే బ్రిక్స్ ప్రత్యేకత అని ప్రధాని అన్నారు. వైవిధ్యమే తమ బలం అని పేర్కొన్నారు. ఈ సహకారం మానవాళికి ఉపయోగపడేలా ఉండాలని ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొన్న దేశాల నేతలు, ప్రతినిధులకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వారి సూచనలు, ఆలోచనలు బ్రిక్స్ సహకారానికి మరింత బలం చేకూర్చాయని అన్నారు. తదుపరి బ్రిక్స్ సదస్సుకు ఆతిథ్యం ఇవ్వనున్న చైనాకు శుభాకాంక్షలు తెలిపారు. న్యూఢిల్లీ సదస్సును విజయవంతం చేసిన అన్ని దేశాల బృందాలను అభినందించారు. ఢిల్లీ డిక్లరేషన్‌తో బ్రిక్స్ మరింత విస్తృతంగా, బలమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని మోదీ స్పష్టం చేశారు.



## నడిసంద్రంలో
# మునిగిన నౌక
### 242 మంది గల్లంతు
### 100 మందిని రక్షించినట్లు ప్రకటించిన ప్రభుత్వం

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

లోని జావా సముద్రంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక నౌక అకస్మాత్తుగా గల్లంతయింది. తూర్పు జావాలోని సురబయ నుంచి దక్షిణ కలిమంతన్ ప్రాంతంలోని బంజర్మసిన్‌కు ప్రయాణికులతో బయలుదేరిన విర్గో ట్రాన్స్‌పోర్ట్ 8 నౌక ప్రయాణంలో ఉండగా ఒక్కసారిగా సిగ్నల్స్ కోల్పోయి, కమ్యూనికేషన్ కట్ అయి పోయింది. ఈ నౌకలో సుమారు 240 మంది ప్రయాణికులు ఉన్నట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి.

**ప్రతికూల వాతావరణం వల్లే..**

తూర్పు జావా ప్రావిన్స్ నుంచి బయలుదేరిన ఈ నౌక మార్గమధ్యంలో ప్రతికూల వాతావరణాన్ని ఎదుర్కొన్నట్లుగా తెలిసింది. బంజర్మసిన్‌లోని ప్రధాన కేంద్రానికి సుమారు 148 కి.మీ దూరంలో జావా సముద్రంలో ఉండగా నౌకతో సంబం ధాలు పూర్తిగా తెగిపోయాయి. ఈ అనూహ్య పరిణామంతో అప్రమత్తమైన ఇండోనేషియా రెస్క్యూ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. నౌక గల్లంతైన సమాచారం అందుకున్న వెంటనే సెర్చ్ అండ్ రెస్క్యూ అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. బంజర్మసిన్‌లోని త్రిశక్తి పోర్టు కేంద్రంగా ప్రత్యేక ఆపరేషన్ రూమ్‌ను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు సముద్రంలో నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా దాదాపు 102 మందిని రక్షించినట్లుగా అధికారులు తెలిపారు. గల్లంతైన మిగతా ప్రయాణికుల కోసం నేవీ, రెస్క్యూ బోట్లు, ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.



# హర్మూజ్‌పై ఇరాన్, ఒమన్ కీలక ఒప్పందం!

**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, ప్రపంచ దేశాల చూపు మరోసారి హర్మూజ్ జలసంధిపై పడింది. ప్రపంచ చమురు, ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన ఆ మార్గంలో ఇరాన్, ఒమన్ కలిసి కీలక నిర్ణయం తీసుకున్నాయి. హర్మూజ్ జలసంధిలో కొత్త ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను ఏర్పాటు చేసేందుకు ఇరు దేశాలు అంగీకరించినట్లు సమాచారం. ఈ మార్గాలకు సంబంధించిన వివరాలను గల్ఫ్ దేశాలకు కూడా వివరించేందుకు సిద్ధమవుతున్నాయి. చైనా ప్రభుత్వ వార్తా సంస్థ జిన్హువా వెల్లడించిన వివరాల ప్రకారం, కొత్త మార్గాలపై ఇరాన్, ఒమన్ మధ్య చర్చలు జరిగాయి. ఆ చర్చల్లో మార్గాల విషయంలో ఒక అవగాహనకు వచ్చాయి. సోమవారం ఒమన్ రాజధాని మస్కట్‌లో జరగనున్న ప్రాంతీయ సమావేశంలో గల్ఫ్ దేశాలకు ఈ వివరాలను వెల్లడించనున్నట్లు ఇరాన్ అధికారులు తెలిపారు. ఇరాన్, ఒమన్ మధ్య తాజా అవగాహనకు పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యం ఏర్పడింది. హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. ఈ ప్రాంతంలో ఎలాంటి అంతరాయం ఏర్పడినా అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందుకే హర్మూజ్ జలసంధిలో రాకపోకలు సాఫీగా కొనసాగడం ఇప్పుడు ప్రాంతీయ దేశాలతో పాటు ప్రపంచ దేశాలకు కూడా ముఖ్యమైన అంశంగా మారింది. ఈ నేపథ్యంలో కొత్త ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలపై ఇరాన్, ఒమన్ తీసుకున్న నిర్ణయం ఆసక్తిని రేపుతోంది.

**బ్రిక్స్ వేదికగా ఇరాన్ అధ్యక్షుడి కీలక వ్యాఖ్యలు**

ఇదే సమయంలో ఢిల్లీలో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు వేదికగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ వేదికగా ఇచ్చిన ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన బ్రిక్స్ లక్ష్యాలను వివరించారు. అమెరికా విధిస్తున్న ఏకపక్ష ఆంక్షలకు ప్రత్యామ్నాయంగా బ్రిక్స్ దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని పెజెష్కియాన్ అన్నారు. ఒక దేశం తనకు నచ్చిన దేశంపై ఆంక్షలు విధించే పరిస్థితిని మార్చడమే బ్రిక్స్ ఉద్దేశాల్లో ఒకటని చెప్పారు. ఆంక్షలతో సంబంధం లేకుండా బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యం, సహకారం కొనసాగేలా కొత్త మార్గాలను అభివృద్ధి చేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఏకపక్ష విధానాలకు వ్యతిరేకంగా సభ్య దేశాలు ఒకరికొకరు మద్దతుగా నిలవాలని అన్నారు.

**పశ్చిమాసియాపై బ్రిక్స్ ఏకాభిప్రాయం**

మరోవైపు పశ్చిమాసియాలో పరిస్థితిపై బ్రిక్స్ దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిందని భారత విదేశాంగ శాఖ ఆర్థిక సంబంధాల కార్యదర్శి సుధాకర్ దలేలా తెలిపారు.

ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు ముగిసిన తర్వాత నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. పశ్చిమాసియాలో సమస్యలకు చర్చలు, దౌత్య మార్గాలే పరిష్కారమని బ్రిక్స్ దేశాలు భావిస్తున్నాయని చెప్పారు. భిన్నమైన అభివృద్ధి నమూనాలు, ఆర్థిక వ్యవస్థలు ఉన్న దేశాలు బ్రిక్స్‌లో సభ్యులుగా ఉన్నందు, ప్రతి దేశం తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పేందుకు భారత్ వేదిక కల్పించిందని తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఏకాభిప్రాయానికి వచ్చినట్లు చెప్పారు. శాశ్వత శాంతి, భద్రత, స్థిరత్వం కోసం చర్చలు, దౌత్యమే ప్రధాన మార్గాలని స్పష్టం చేశారు. 18వ బ్రిక్స్ సదస్సులో ఢిల్లీ డిక్లరేషన్ 2026ను సభ్య దేశాల నేతలు ఏకగ్రీవంగా ఆమోదించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఇందులో తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితిని మరింత దిగజార్చే చర్యలకు దూరంగా ఉండాలని, గరిష్ఠ సంయమనం పాటించాలని పిలుపునిచ్చారు. అలాగే పౌరులు, పౌర మౌలిక వసతులను రక్షించాలని బ్రిక్స్ దేశాలు స్పష్టం చేశాయి. దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలని కోరాయి. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా ప్రపంచ వాణిజ్యం, సరఫరా వ్యవస్థలు, ఇంధన రవాణా సజావుగా కొనసాగాలని పేర్కొన్నాయి. ప్రశాంతమైన అణు కేంద్రాలపై దాడుల విషయంలోనూ బ్రిక్స్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ పర్యవేక్షణలో ఉన్న అణు సౌకర్యాల భద్రతకు ఎలాంటి పరిస్థితుల్లోనూ విఘాతం కలగకూడదని స్పష్టం చేసింది.

## బ్రహ్మోత్సవాలకు
# తిరుమల ముస్తాబు

**మొదటి పేజీ తరువాయి...**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 15న శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అదే రోజు రాత్రి జరిగే పెద్దశేష వాహన సేవలోనూ సీఎం పాల్గొంటారు. అనంతరం 16న ఉదయం నవీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ సంస్థ విరాళంగా అందించిన 25 ఎలక్ట్రిక్ బస్సులు, భక్తుల గ్రూప్ ఇన్సూరెన్స్ పథకాన్ని సీఎం ప్రారంభించనున్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలలో సామాన్య భక్తులకే అత్యున్నత ప్రాధాన్యం కల్పిస్తూ టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్సవాల రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని రకాల ప్రత్యేక దర్శనాలను రద్దు చేసింది. ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలను పరిమితం చేస్తూ, సాధారణ సిఫార్సు లేఖలపై ఇచ్చే బ్రేక్ దర్శనాలను నిలిపివేసింది. అలాగే వయోవృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు ఇచ్చే ప్రత్యేక ప్రివిలేజ్ దర్శనాలను కూడా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. సామాన్య భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా స్వామివారిని దర్శించుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని, భక్తులు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన గరుడసేవ, ముగింపు రోజైన చక్రస్నానం ఏర్పాట్లపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో కలిసి టీటీడీ అధికారులు నిశితంగా పరిశీలించారు. గరుడసేవ రోజున రద్దీని నియంత్రించేందుకు భద్రతా ప్రమాణాలను పక్కాగా సిద్ధం చేశారు. చక్రస్నానం నిర్వహించే శ్రీవారి పుష్కరిణి వద్ద ప్రవేశ, నిష్క్రమణ మార్గాల పనులను ఇప్పటికే పూర్తి చేశారు. తిరుమల కొండపై అడుగడుగునా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి మాడ వీధుల్లో జరుగుతున్న పనులను, సీసీటీవీ కంట్రోల్ రూమ్ పనితీరును స్వయంగా పర్యవేక్షిస్తూ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. టీటీడీ విజిలెన్స్, నిఘా విభాగం, జిల్లా పోలీసు శాఖలు సంయుక్తంగా సమన్వయం చేసుకుంటూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం, తొక్కిసలాట లాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాయి. తిరుమాడ వీధులు విద్యుద్దీపాలు, రంగవల్లులు, పుష్పాలంకరణలతో వైకుంఠాన్ని తలపిస్తున్నాయి.

# కేంద్ర పథకాలతో నిధుల సేకరణ

**మొదటి పేజీ తరువాయి...**

మాత్రమే కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం నుంచి అదనపు నిధులు రాబట్టడంతో పాటు అవి సకాలంలో ఖర్చయ్యేలా సీఎం చంద్రబాబు ప్రభుత్వ శాఖలు, జిల్లా కలెక్టర్లకు మార్గదర్శనం చేస్తున్నారు. ఈ ఏడాది నాలుగో విడత నిధులు కేంద్రం నుంచి మంజూరు కావాల్సి ఉంది. ఆ మొత్తం కూడా సమకూరితే గత రెండు సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మొత్తానికి సమానంగా ఈ ఒక్క ఏడాదిలోనే సాధించినట్లు అవుతుంది. 2024-2025, 2025-2026 ఆర్థిక సంవత్సరాల్లో ఉమ్మడి పథకాలకు కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ.38,115 కోట్లు వెచ్చించారు. తద్వారా రెండు కోట్ల మందికి లబ్ధి చేకూరింది. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో ఏపీకి కేంద్ర పథకాల కింద తొలి విడతలో వచ్చిన రూ.8694 కోట్లు ఇప్పటికే వెచ్చించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10,552 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమ కాగా, వాటికి రాష్ట్ర ప్రభుత్వ వాటా కలిపి మొత్తం రూ.18,516 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయి. మొత్తం 23 ప్రభుత్వ శాఖల్లో ఆరింటికి కేంద్రం ఈ సంవత్సరం రూ.1000 కోట్లకు మించి మంజూరు చేసింది. ఒక్క పంచాయతీరాజ్ శాఖకే రూ.11,184 కోట్లు మంజూరుకాగా, ఇప్పటికే రూ.4461 కోట్లు రాష్ట్ర ఖజానాకు జమయ్యాయి. గృహనిర్మాణ శాఖకు రూ.2500 కోట్లు, ప్రాథమికోన్నత విద్యకు రూ.2351 కోట్లు, వైద్యారోగ్యశాఖకు రూ.2232 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమానికి రూ.1398 కోట్లు, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖకు రూ.1210 కోట్ల చొప్పున మంజూరయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేలా కేంద్రం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ కింద వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో కేవలం రూ.2255 కోట్లు మాత్రమే వెచ్చించింది. ఈ పథకం గడువు ముగిసేలోగా ఏపీలోని 95.44 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న లక్ష్యం నెరవేరలేదు. ఎన్డీయే సర్కార్ ఏర్పడ్డాక కేంద్రంతో చర్చించి, పథకం గడువు పొడిగింపజేయడంతో పాటు నిధుల సాధనపై దృష్టి పెట్టింది. ఈ సంవత్సరం కేంద్రం రూ.2631 కోట్లు కేటాయించింది.



# ఇక ఫాస్టాగ్ పోర్టబులిటీ

**మొదటి పేజీ తరువాయి...**

ఇకపై ఆ అవసరం లేకుండా ఒకే స్టిక్కర్‌తో నచ్చిన బ్యాంకుకు మారే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చారు. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన 'ఫాస్టాగ్ వన్' పోర్టబులిటీ విధానం ద్వారా పాత ఖాతాను క్లోజ్ చేయాల్సిన పని లేకుండానే వేరే బ్యాంకును ఎంచుకోవచ్చు. వాహనదారుడి ట్యాగ్ ఐడీ, రిజిస్ట్రేషన్ నెంబర్, విండ్‌స్క్రీన్ స్టిక్కర్ పాతవే కొనసాగుతాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థలు సంయుక్తంగా ఈ ఆధునిక సాంకేతిక సేవలను అభివృద్ధి చేశాయి. వాహనదారులు 'రాజ్ మార్గ్ యాత్ర' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అర్హత చెకింగ్, వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసి నచ్చిన బ్యాంకును ఎంచుకోవచ్చు. పాత ఖాతాలోని బ్యాలెన్స్, పెండింగ్ లావాదేవీలు పూర్వపు బ్యాంకే చూసుకుంటుంది. స్టిక్కర్లు పదే పదే మార్చే శ్రమ తగ్గించి, టోల్ సేవలను మరింత వేగవంతం చేసేందుకు ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడనుంది.



# వదంతులు నమ్మొద్దు..!

**మొదటి పేజీ తరువాయి...**

తేల్చిచెప్పింది. ప్రైవేటు వాహనాల సంఖ్యపై టీటీడీ ఎలాంటి పరిమితులు గానీ, కొత్త నిర్ణయాలు గానీ తీసుకోలేదని ఓ ప్రకటనలో వెల్లడించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఇలాంటి వదంతులను, తప్పుడు వార్తలను భక్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని టీటీడీ విజ్ఞప్తి చేసింది. శ్రీవారి దర్శనం, తిరుమల ప్రయాణానికి సంబంధించిన ఏ సమాచారాన్నైనా కేవలం టీటీడీ అధికారిక ప్రకటనలు, వెబ్‌సైట్ ద్వారానే నిర్ధారించుకోవాలని భక్తులకు సూచించింది. టీటీడీ పేరుతో భక్తులను గందరగోళానికి గురిచేసేలా తప్పుడు వార్తలను ప్రచారం చేసే వారిపై చట్టపరంగా తీసుకుంటామని ఈ సందర్భంగా టీటీడీ అధికారులు హెచ్చరించారు. జర్నలిజంలో గత పదేళ్లుగా పనిచేస్తున్నారు. గత దశాబ్దకాలంలో పలు ప్రముఖ తెలుగు మీడియా సంస్థలలో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. ఏపీ, తెలంగాణ, జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ, వర్తమాన అంశాలపై కథనాలు అందిస్తారు. గ్రాడ్యుయేషన్ పూర్తయ్యాక జర్నలిజం కోర్సు పూర్తిచేసి కెరీర్‌గా ఎంచుకున్నారు. నేషనల్ మీడియాకు చెందిన పలు తెలుగు మీడియా సంస్థలలో సీనియర్ కంటెంట్ రైటర్‌గా సేవలు అందించారు. జర్నలిజంలో వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఆనంద్ బజార్ పత్రిక నెట్‌వర్క్ కు చెందిన తెలుగు డిజిటల్ మీడియా ఏబీపీ దేశంలో గత నాలుగేళ్ల నుంచి న్యూస్ ప్రొడ్యూసర్‌గా పనిచేస్తున్నారు.

# బిజినెస్ ఎక్స్‌పోను సందర్శించిన హోం మంత్రి అనిత






**విశాఖపట్నం, (జయ జయహే) సెప్టెంబర్ 13:**

ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని గదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న బిజినెస్ ఎక్స్‌పో--2026ను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత మూడో రోజు సందర్శించారు. ఈ సందర్భంగా బిజినెస్ ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను హోం మంత్రి అనిత పరిశీలించారు. ఎక్స్‌పోకు విచ్చేసిన హోం మంత్రి అనితకు ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఛాంబర్స్ ప్రతినిధులు హోం మంత్రి అనితకు ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను చూపిస్తూ, ఆయా సంస్థలు, ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన వివరాలను వివరించారు. స్టాల్స్‌ను ఆసక్తిగా పరిశీలించిన హోం మంత్రి.. వ్యాపార, పారిశ్రామిక రంగాల అభివృద్ధి, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇలాంటి ఎక్స్‌పోలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. బిజినెస్ ఎక్స్‌పోలో వివిధ రంగాలకు చెందిన వ్యాపార, పారిశ్రామిక సంస్థలు పాల్గొని తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తున్నాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్స్ ప్రతినిధులు, నిర్వాహకులు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.



## రూ.5లక్షలతో రామాలయ నిర్మాణం

### పిఏసిఎస్ ఛైర్మన్ నరేశ్

**బుచ్చయ్యపేట,జయ జయహే**

వడ్డాది పల్లె వీధిలో అసంపూర్తిగా ఉన్న రామాలయాన్ని తమ స్వంత నిధులు రూ.5 లక్షలతో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు పిఏసిఎస్ అధ్యక్షుడు, టౌన్ టిడిపి అధ్యక్షుడు దొండా నరేశ్ తెలిపారు.ఆదివారం సంబంధిత ప్రదేశాన్ని సందర్శించి హద్దులు నిర్ధారించి కొలతలు వేశారు.స్టేట్ హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు సిఫారసుతో రామాలయ నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.ఆలయ నిర్మాణ బాధ్యత తమదే అని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.రామాలయ నిర్మాణం పూర్తి కావడం ద్వారా స్థానిక ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు.గ్రామ ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, అసంపూర్తిగా ఉన్న రామాలయ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ముందుకు వచ్చిన నరే శ్ కి కృతజ్ఞతలు తెలిపారు.దొండా రమేష్ ,సయ్యపురెడ్డి మాధవరావు,బత్తుల అప్పారావు, తలారి శంకర్, కోరుకొండ గురుమూర్తి ,భావిశెట్టి శ్రీను, పెమ్మె ప్రసాద్, సమేనా నానాజీ, తామాడ నానాజీ, పల్లె వీధి పెద్దలు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## గంజాయి కేసుల్లో నిందితుడు మీసాల సాయి సుమంత్‌పై పి.డి.యాక్ట్

**విజయనగరం జయజయహే**




గంజాయి విక్రయించినా, రవాణ చేసినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించి గంజాయి నేరాలకు పాల్పడుతున్న 27 ఏళ్ల నిందితుడు మీసాల సాయి సుమంత్ పై నమోదు చేసిన కేసు వివరాలు ఆదివారం ప్రకటనలో వెల్లడించారు . నిందితుడు అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటకు చెందినవాడని, ప్రస్తుతం విజయనగరం మండలం చెల్లూరు గ్రామంలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు. గంజాయి క్రయ విక్రయాలు చేస్తూ కింగ్ పిన్' గా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు . నిందితుడు తరచూ చట్టాన్ని ఉల్లంఘించే వాడన్నారు . ఇప్పటికే గంజాయికి సంబంధించి ఐదు కేసులు నమోదయ్యాయని ప్రస్తుతం పలు న్యాయ స్థానాల్లో విచారణలో ఉన్నాయన్నారు. పి.డి.యాక్ట్ ప్రయోగించి అదుపులోకి తీసుకొని విశాఖపట్నం కేంద్ర కారాగారానికి తరలించినట్లుగా తెలిపారు. కేసులో బాగంగా ఒక ఏడాది పాటు బెయిల్ మంజూరు కాదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, అటువంటి వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులు నేర ప్రవృత్తిని విడనాడాలని, చట్టాన్ని గౌరవిస్తూ, సత్ప్రవర్తనతో జీవించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సూచించారు .



## మద్యం దుకాణాలు రెన్యూవల్‌కు నోటిఫికేషన్ జారీ

**చోడవరం సెప్టెంబర్ 13, జయ జయహే**

మద్యం దుకాణాలు రెన్యువల్ కి నోటిఫికేషన్ చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం డి.సి. శ్రీరామచంద్ర మూర్తి , విశాఖ డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏ.సి. రవి కుమార్, అనకాపల్లి జిల్లా డి. పి. ఈ. ఒ. వి. సుధీర్, చోడవరం మరియు మాడుగుల ఎక్సైజ్ అధికారులు చోడవరం మాడుగుల వైన్ షాప్స్ యజమానులు పాల్గొన్నారు . ప్రస్తుతం ఉన్న ఎగ్జిస్టింగ్ లైసెన్సీలు రెన్యూవల్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. విశాఖపట్నం కంబైండ్ ఎక్సైజ్ జిల్లా పరిధిలోని నాలుగు జిల్లాల్లో మొత్తం 355 లిక్కర్ షాపులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో అనకాపల్లి జిల్లాలో 150, విశాఖపట్నం జిల్లాలో 150, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 21, పోలవరం జిల్లాలో 15 షాపులు ఉన్నాయని తెలిపారు.



## విద్యార్థులకు ఆసరాగా రూ.40 వేల ఆర్థిక సాయం

**విజయనగరం, సెప్టెంబరు 13 జయ జయహే**

పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతోనే తమ సంస్థ పనిచేస్తోందని వాసవి చారిటీ గ్రూప్ అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్ తెలిపారు. స్థానిక సంఘం కార్యాలయం లో గ్రూప్ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన పలువురు ఆర్యవైశ్య విద్యార్థులకు ఆదివారం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా గ్రూప్ కార్యదర్శి డిమ్స్ రాజు మాట్లాడుతూ..గత ఐదేళ్లుగా విద్య, వైద్యం, వివాహాల వంటి అవసరాలకు ఎవరూ ఇబ్బంది పడకుండా తమ గ్రూప్ ఎల్లప్పుడూ ఆసరాగా నిలుస్తోందని పేర్కొన్నారు. సమాజ సేవలో భాగంగా ఇప్పటివరకు 60 రకాల సహాయక కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చారిటీ గ్రూప్ కోశాధికారి సముద్రాల నాగరాజు, సభ్యులు బీవీపీఎస్ రామయ్య, కలగర్ల నారాయణరావు, శంకర్రావు, వీరభద్రరావు, ఏ.వి. కృష్ణారావు, వజ్రపు కృష్ణారావు, పీ.వి. రామారావు, రవ్వా శ్రీనివాస్, కుమ్మరిగుంట శ్రీనివాసరావు, ఉపేంద్ర, కాపుగంటి రవి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



## పంటి వైద్యం.. పుస్తక పఠనం

### విజయనగరం రీడ్స్, వి డెంటల్ కేర్ సంయుక్తంగా తొలి హాస్పిటల్ లైబ్రరీ ఏర్పాటు

**విజయనగరం, సెప్టెంబర్ 13, జయ జయహే :**

పుస్తక పఠనం ద్వారా మనలోని సృజనాత్మకత పెంపొందుతుందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.లజపతిరాయ్ పేర్కొన్నారు. విజయనగరం రీడ్స్, వి డెంటల్ కేర్ సంయుక్తంగా విజయనగరం వి డెంటల్ హాస్పిటల్లో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఆసుపత్రి సందర్శనకు వచ్చే వారు తమ వెయిటింగ్ సమయాన్ని పుస్తకాలతో గడిపేందుకు ఆసుపత్రి యాజమాన్యం చక్కని ఏర్పాటు చేసిందని, ఈ తరహా వినూత్న ఆలోచనతో హాస్పిటల్ లైబ్రరీని నెలకొల్పటం అభినందనీయమన్నారు. వి డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె. రమేష్ మాట్లాడుతూ కథలు సాహిత్యం కు సంబంధించిన పుస్తకాలతో పాటు పిల్లల కోసం కూడా పుస్తకాలు ఈ చిన్న లైబ్రరీలో అందుబాటులో ఉంచామని తెలిపారు. ఖాళీ సమయాలలో స్క్రీన్ నుంచి బుక్కు మీదకు మన దృష్టిని మళ్లించడం ఆరోగ్యకరమన్నారు.పుస్తక పఠనం ఒక అలవాటుగా మార్చేందుకు చిన్న ప్రయత్నం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. విజయనగరం రీడ్స్ వ్యవస్థాపకులు ఆర్. ఈశ్వర్ పలు పుస్తకాలను ఈ గ్రంథాలయం కోసం ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ డైరెక్టర్ కల్యాణ విశ్వనాథ్, డేటా సైంటిస్ట్ పి.నవీన్, వీడెంటల్ కార్పొరేట్ మేనేజర్ కె. పృథ్వీరాజ్, డాక్టర్ మధుసూదన్, సోనియా, శ్రావణి, గౌరీ తదితరులు పాల్గొన్నారు.ం



## నీటి ఎద్దడి నివారణకు చర్యలు: గంటా

**విశాఖపట్నం, సెప్టెంబర్ 13: (జయ జయహే)**

నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. నీటి ఎద్దడిపై మున్సిపల్ మంత్రి నారాయణ, విశాఖ, విజయనగరం జిల్లాల కలెక్టర్లు, జీవీఎంసీ కమిషనర్, నీటిసరఫరా అధికారులతో ఆదివారం జూమ్ కాల్ లో మాట్లాడారు. కనీస అవసరాలకు సైతం నీరు లేక ఎంవీవీ సిటీ ఫ్లాట్ లలో నివాసముంటున్న వారు ఎదుర్కొంటున్న ఇబ్బందిని అధిగమించేలా ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని సూచించారు. 6 కిలో లీటర్లు, 12 కిలో లీటర్ల ట్యాంకర్ల ద్వారా 1.44 లక్షల లీటర్ల నీటిని ఎంవీవీ సిటీకి సరఫరా చేసినట్టు తెలిపారు. నీటి సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లు పంపాలన్నారు. వర్షాభావం వల్ల తాగునీరు సహా వాడుక నీటి సమస్య తలెత్తిందని, మధురవాడ పరిసర ప్రాంత ప్రజలకు నీటి కష్టాలు తీర్చడానికి రూ.550 కోట్ల వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్టు పేర్కొన్నారు. తాగునీటి ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని విశాఖ ప్రజల నీటి అవసరాలను తీర్చడానికి తాటిపూడి రిజర్వాయర్ నుంచి సరఫరా పునరుద్ధరణ అత్యావశ్యకమని చెప్పారు. పోలవరం ఎడమ కాలువ నీరు అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎలాంటి సమస్య ఉండదన్నారు. స్థానికంగా ఉన్న నీటి వనరుల నుంచి ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నీరందించే అవకాశాలను పరిశీలించాలని చెప్పారు. మధురవాడ, భీమిలి జోన్ లలో నీటి సమస్య తీవ్రత తగ్గించేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని వెల్లడించారు.



## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### చిన్నపాటి లోపాలకు కూడా తావివ్వొద్దు: జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

**తిరుపతి, సెప్టెంబర్ 13, జయ జయహే**

తిరుపతి తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 15, 16 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లాలో పర్యటించి శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లు, భద్రతా చర్యల్లో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ముందస్తు భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. జయకృష్ణలతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించే అన్ని ప్రాంతాల్లో విధులు కేటాయించిన అధికారులు సమన్వయంతో, పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. వైద్య శిబిరం, అంబులెన్స్‌ల ఏర్పాట్లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమన్వయం చేయాలని ఆదేశించారు.సేఫ్టీ రూమ్, అధునాతన లైఫ్ సపోర్ట్, ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు, పారిశుధ్య ఏర్పాట్లు, కాన్వాయ్ వాహనాల ఏర్పాటు, హెలిప్యాడ్ వద్ద భద్రతా చర్యలు, ప్రోటోకాల్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. కేటాయించిన ప్రతి అధికారి ఎలాంటి అలసత్వం లేకుండా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడుతో కలిసి విమానాశ్రయంలోని పలు ప్రాంతాలను పరిశీలించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్, అదనపు ఎస్పీలు రవిమనోహర్ అచ్చారి, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాజానాయక్, జిల్లా రవాణా అధికారి మురళీమోహన్, విమానాశ్రయ అధికారి భూమినాథన్‌తో పాటు జిల్లా అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, భద్రతా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## టీడీపీ ఎన్నికల పరిశీలకులు షరీఫ్‌తో పాశర్ల ప్రసాద్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 13, జయ జయహే**



విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల టీడీపీ ఇన్చార్జిగా నియమితులైన మాజీ శాసనమండలి చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ షరీఫ్ ని అడవివరం మాజీ సర్పంచ్ పాశర్ల ప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యిద్దరూ పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. సింహాచలం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు కూడా కావడంతో పంచ గ్రామాల సమస్యను షరీఫ్ దృష్టికి పాశర్ల తీసుకెళ్లారు. వచ్చే ఎన్నికలలో ఈ భూ సమస్య ప్రభావం లేకుండా తగు ప్రణాళికలను మాజీ ఎమ్మెల్సీ ముందుంచారు.

# మట్టిలో పుట్టిన దేవుడు.. మట్టినే కాపాడమంటున్నాడు

## భక్తి పేరుతో ప్రకృతికి విఘాతం వద్దు.. మట్టి గణపతితోనే సంప్రదాయానికి పునర్వైభవం

వినాయకుడు.. విఘ్నాలను తొలగించే దేవుడు. ఏ పూజైనా.. ఏ శుభకార్యమైనా తొలి పూజ ఆయనకే. వినాయక చవితి వచ్చిందంటే చాలు.. ఊరూవాడా పండుగ వాతావరణం. ఇళ్లలో పూజలు.. వీధుల్లో మండపాలు.. గణనాథుడి నామస్మరణతో సందడి. భక్తి వెల్లువలో మనం ఒక విషయాన్ని మాత్రం మరిచిపోతున్నాం. విఘ్నాలను తొలగించే వినాయకుడి పండుగే.. ప్రకృతికి విఘ్నంగా మారకూడదు కదా? భక్తితో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహాన్ని నిమజ్జనం పేరుతో చెరువులు, నదుల్లో వదులుతున్నాం. పూజా సామగ్రి, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలూ నీటిలో కలుస్తున్నాయి. ఇప్పటికే కాలుష్యంతో సతమతమవుతున్న జల వనరులపై పండుగ పేరుతో మరో భారం పడుతోంది. భక్తి అంటే ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం కాదు. దేవుడిని పూజించడంతో పాటు ఆయన సృష్టించిన ప్రకృతిని కాపాడటమూ మన బాధ్యతే.






**మట్టితో మమేకమైన సంప్రదాయం**

మట్టి గణపతి కొత్తగా వచ్చిన ఆలోచన కాదు. మన పూర్వీకుల ఆచారంలోనే దానికి స్థానం ఉంది. సహజ మట్టితో విగ్రహాన్ని తయారు చేయడం.. పూజించడం.. అనంతరం అదే మట్టిలో కలపడం వెనుక ప్రకృతితో మనిషి అనుబంధాన్ని గుర్తుచేసే తాత్వికత ఉంది. మట్టి నుంచి పుట్టిన మనిషి.. చివరికి మట్టిలోనే కలుస్తాడు. ఈ సత్యాన్ని గుర్తుచేసే మట్టి గణపతి సంప్రదాయం నేడు క్రమంగా కనుమరుగవుతోంది. దాని స్థానంలో భారీ విగ్రహాలు.. భారీ మండపాలు.. హంగులు.. ఆర్భాటాలు వచ్చాయి. విగ్రహం ఎత్తు పెరిగింది.. ఖర్చు పెరిగింది.. పోటీ పెరిగింది. కానీ భక్తి అంతే స్థాయిలో పెరిగిందా అన్నది ప్రశ్న. దేవుడికి కావాల్సింది భారీ విగ్రహం కాదు.. స్వచ్ఛమైన భక్తి.

**పీఓపీతో పెరుగుతున్న ముప్పు**

ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ)తో తయారైన విగ్రహాలు సహజ మట్టి విగ్రహాల్లా సులభంగా కరిగిపోవు. వాటికి వేసే పూతలు, రంగులు, ఇతర పదార్థాలు కూడా నీటి నాణ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. నిమజ్జనం తర్వాత మిగిలే విగ్రహాల అవశేషాలు జల వనరుల్లో పేరుకుపోతాయి. దీనికి తోడు పూజా సామగ్రి, ప్లాస్టిక్ సంచులు, థర్మాకోల్, వస్త్రాలు వంటి వ్యర్థాలు కూడా నీటిలో కలుస్తున్నాయి.

ఒకవైపు చెరువులు, నదులు, కాలువలు ఇప్పటికే మురుగు, ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇబ్బందులు పడుతున్నాయి. మరోవైపు పండుగల సందర్భంగా కూడా వాటిలోకి వ్యర్థాలు చేరుతున్నాయి.

దేవుడిని పూజించిన నీటినే.. మరుసటి రోజు మనమే ఉపయోగించుకోవాలి.

అలాంటప్పుడు ఆ నీటిని కలుషితం చేయడం ఎంతవరకు సమంజసం?

భక్తికి కొలమానం ఆర్భాటం కాదు

వినాయకుడికి భారీ విగ్రహమే కావాలా? భారీ శబ్దాలు.. లైటింగ్.. ఆర్భాటాలే భక్తికి కొలమానాలా? కాదు. గరిక, పత్రి, పుష్పాలు.. ఉండ్రాళ్లు.. మనస్ఫూర్తిగా చేసే ప్రార్థన.. కుటుంబమంతా కలిసి జరుపుకునే పండుగ.. ఇవే వినాయక చవితి అసలైన అందం.పండుగలో పోటీ ఉండొచ్చు. కానీ ప్రకృతితో పోటీ వద్దు.విగ్రహం పెద్దదవుతున్న కొద్దీ భక్తి పెరగాల్సిన అవసరం లేదు. మనసు పెద్దదైతే చాలు.

ఈసారి మారుదాంఈ వినాయక చవితి నుంచి చిన్న మార్పు మొదలుపెడదాం.

మట్టి గణపతిని ఎంచుకుందాం:

సహజ మట్టితో తయారైన విగ్రహాలకు ప్రాధాన్యం ఇద్దాం. స్థానిక కుమ్మరి కుటుంబాలను ప్రోత్సహిద్దాం. మన పండుగ వారి జీవనోపాధికి కూడా తోడ్పడేలా చూద్దాం.

సహజ పదార్థాలతో అలంకరిద్దాం:

ప్లాస్టిక్, థర్మాకోల్‌ను వీలైనంత వరకు దూరం పెట్టి.. పూలు, ఆకులు, మామిడి తోరణాలు, అరటి ఆకులు వంటి సహజ పదార్థాలను ఉపయోగిద్దాం.

**బాధ్యతగా నిమజ్జనం చేద్దాం:**

పూజా సామగ్రి, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను నదులు, చెరువుల్లో వేయకూడదు. స్థానిక సంస్థలు ఏర్పాటు చేసే నిమజ్జన కేంద్రాలు, కృత్రిమ కొలనులను వినియోగిద్దాం. సాధ్యమైన చోట ఇంట్లోనే మట్టి గణపతిని నిమజ్జనం చేసి.. ఆ మట్టిని మొక్కలకు వినియోగించవచ్చు.

ఇది పండుగను తగ్గించడం కాదు. పండుగను మరింత అర్థవంతంగా మార్చడం.

పండుగ మనదే.. బాధ్యతా మనదే

వినాయక చవితి ఒక్కరోజు పండుగ కావచ్చు. కానీ మన నిర్ణయాల ప్రభావం మాత్రం ఏడాది పొడవునా ఉంటుంది.

మనం ఎంచుకునే విగ్రహం.. వేసే అలంకరణ.. చేసే నిమజ్జనం.. అన్నీ పర్యావరణంపై ప్రభావం చూపుతాయి.

అందుకే ఈసారి గణనాథుడిని భక్తితో పూజిద్దాం. అదే సమయంలో ప్రకృతిని కూడా గౌరవిద్దాం.

వినాయకుడిని పూజించడం భక్తి అయితే.. ఆయన సృష్టించిన ప్రకృతిని కాపాడటం మన ధర్మం.

మట్టి గణపతిని ఇంటికి తెద్దాం..

మన మట్టిని కాపాడుకుందాం.

నీటి వనరులను కలుషితం చేయకుండా..

భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందిద్దాం.

ఈ వినాయక చవితి.. భక్తితో పాటు బాధ్యతకు కూడా పండుగ కావాలి.



**జి. అజయ్ కుమార్**

# విజృంభిస్తున్న సైబరాసురులు

(ప్రతాప్)

**ఒకప్పుడు దొంగ మన ఇంటి తలుపు తట్టేవాడు. ఇప్పుడు మన చేతిలోని ఫోన్ ద్వారా మన మనసు తలుపు తడుతున్నాడు. ఒకప్పుడు నేరగాడు కత్తి చూపించి డబ్బు దోచుకునేవాడు. ఇప్పుడు పోలీసు అధికారి పేరును, న్యాయస్థానం పేరును, ప్రభుత్వ ముద్రను చూపించి మన భయాన్నే దోచుకుంటున్నాడు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ నేరాల స్వరూపం కూడా మారుతోంది. ముఖ్యంగా 'డిజిటల్ అరెస్టు' పేరుతో జరుగుతున్న మోసాలు సమాజానికి తీవ్రమైన హెచ్చరికగా మారాయి.**



తాజాగా సూరత్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌కు ముంబై పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థ, భారతీయ రిజర్వు బ్యాంకు, సుప్రీంకోర్టు అధికారులమంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. డ్రగ్స్, పార్సెల్, అక్రమ కార్యకలాపాల పేరుతో భయపెట్టి, చట్టపరమైన సమస్య నుంచి బయటపడాలంటే డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి చేశారు. ఆ విధంగా అతడి నుంచి రూ.13 లక్షలు కాజేశారు.

ఇది ఒక్క ఘటన కాదు. ఇటీవల మహారాష్ట్రలో పదవీ విరమణ చేసిన ఓ దంపతులను నెలరోజులపాటు 'డిజిటల్ అరెస్టు'లో ఉన్నారని నమ్మించి రూ.68.8 లక్షలు బదిలీ చేయించారు. నిందితులు సీనియర్ పోలీసు అధికారుల పేర్లను ఉపయోగించి, ప్రతి రెండు గంటలకు తమ స్థితిని వీడియో కాల్‌లో నిర్ధారించుకోవాలని ఆదేశించారు.

సూరత్‌లోనే 82 ఏళ్ల వృద్ధుడిని దాదాపు 20 రోజులపాటు బెదిరించి రూ.2.96 కోట్లు కాజేసిన ఘటన వెలుగుచూసింది. ముంబై పోలీసులు, ఇతర ప్రభుత్వ సంస్థల పేర్లతో నకిలీ సందేశాలు, పత్రాలు పంపి 'అరెస్టు వారెంట్ ఆపేందుకు' డబ్బు చెల్లించాలని ఒత్తిడి చేశారు.

ఇలాంటి ఘటనలు ఎంత విస్తరిస్తున్నాయో మరో సంఘటన చెబుతోంది. ఢిల్లీలోనే డిజిటల్ చెల్లింపుల మోసం, ఆన్‌లైన్ మోసాల కేసులు 2023లో 1,475 నుంచి 2025లో 3,800కు పెరిగాయి. బాధితులు కోల్పోయిన మొత్తం రూ.1,716 కోట్లకు పైగా ఉంది.



అయితే పరిస్థితి పూర్తిగా నిరాశాజనకమేమీ కాదు. ఇటీవల కేంద్ర దర్యాప్తు సంస్థ డిజిటల్ అరెస్టు ముఠాలపై దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో 89 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి ముగ్గురిని అరెస్టు చేసింది. దర్యాప్తులోని మూడు కేసుల్లోనే మోసం మొత్తం రూ.42.36 కోట్లుగా గుర్తించారు. మరోవైపు, గత 15 నెలల్లో అనుమానాస్పద సైబర్ మోసాల్లో సుమారు రూ.5,043.7 కోట్లను బాధితుల ఖాతాల నుంచి బయటకు వెళ్లకముందే అడ్డుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.

అందుకే ఇప్పుడు ప్రతి కుటుంబంలో ఒక కొత్త భద్రతా నియమం అవసరం---భయంతో నిర్ణయం తీసుకోకూడదు. ఫోన్‌లో ఎవరు పోలీసులమన్నా, న్యాయమూర్తులమన్నా, బ్యాంకు అధికారులమన్నా వెంటనే నమ్మకూడదు. ఎవరూ ఫోన్‌లో 'అరెస్టు నుంచి తప్పించుకోవడానికి' డబ్బు అడగరు. వ్యక్తిగత వివరాలు, రహస్య సంకేతాలు, బ్యాంకు సమాచారం ఇవ్వకూడదు. అనుమానం కలిగితే వెంటనే కుటుంబ సభ్యులకు చెప్పాలి, సంబంధిత అధికారిక సంస్థను స్వయంగా సంప్రదించాలి.

నేరగాళ్లకు మన డబ్బు కంటే ముందు కావలసింది మన భయం. ఆ భయాన్ని మనం జయించిన క్షణమే వారి పన్నాగం సగం విఫలమవుతుంది. సాంకేతికతను నిందించడం పరిష్కారం కాదు; దాన్ని జ్ఞానంతో ఉపయోగించడం పరిష్కారం. ఒక్కసారి ఆలోచించండి... ఒక్కసారి ధృవీకరించండి... ఆ తర్వాతే స్పందించండి.

మన అప్రమత్తత ఒక కుటుంబాన్ని కాపాడుతుంది. మన అవగాహన ఒక సమాజాన్ని కాపాడుతుంది. నేరగాడి చేతిలో సాంకేతికత ఉండొచ్చు; కానీ మన చేతిలో వివేకం ఉన్నంతకాలం విజయం మనదే.

## కాండం, వేర్లలో గణేశుడి ఆకృతి.. కడియం రైతు సృజనాత్మకతకు అద్దం

రాజమహేంద్రవరం: జయ జయహే



సెప్టెంబరు 13: కడియం మండలం కడియపులంకకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీ నిర్వాహకులు, రైతు పుల్లా ఆంజనేయులు 11 ఏళ్లుగా ఎంతో ఓర్పు, నైపుణ్యంతో పెంచిన అరుదైన అడేనియం బోన్సాయ్ మొక్క చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మొక్క కాండం, వేర్ల ఆకృతి మూడు వైపుల నుంచి చూసినా వినాయకుడి రూపాన్ని పోలి ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పుల్లా ఆంజనేయులు మాట్లాడుతూ.. 11 ఏళ్లుగా మొక్కను జాగ్రత్తగా సంరక్షించడంతో కాండం భారీగా, గుండ్రంగా పెరిగి గణేశుడి బొజ్జ, తొండం ఆకృతిని తలపించేలా రూపుదిద్దుకుందని తెలిపారు. మొక్క పైభాగంలో అంటుకట్టే పద్ధతిలో రంగురంగుల పూలు పూసే కొమ్మలను అభివృద్ధి చేయడంతో అవి గణేశుడి తలపై కిరీటంలా అందంగా కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రకృతి ప్రసాదించిన ప్రత్యేక ఆకృతికి 11 ఏళ్ల శ్రమ, సృజనాత్మకత తోడవడంతో ఈ అడేనియం సజీవ శిల్పంలా రూపుదిద్దుకుంది. అరుదైన గణేశ రూపాన్ని పోలిన ఈ మొక్కను చూసేందుకు నర్సరీకి వచ్చే వారు ఆసక్తి చూపుతున్నారని ఆంజనేయులు తెలిపారు. ఆయన సృజనాత్మకత, ఓర్పును పలువురు అభినందిస్తున్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం విజయవంతం చేయండి

బుచ్చయ్యపేట జయ జయహే



ఈ నెల 16 వతేదిన చోడవరం నియోజకవర్గం, లో రోలుగుంట, రావికమతం, బుచ్చయ్యపేట చోడవరం మండలం ల్లో 38 కోట్ల రూపాయలు తో చేపట్టబోయే అభివృద్ధి పనులు ప్రారంభో త్స వం ను విజయవంతం చేయాలని చోడవరం శాసన సభ్యులు కె ఎస్ ఎన్ ఎస్ రాజు కోరారు. ఆదివారం కోమల్లపూడి లో సమావేశం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున నియోజకవర్గం లో పలు గల మండలాల్లో పలు రోడ్ లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గం లో త్వరలో 40 కోట్ల రూపాయలు తో అభివృద్ధి పనులు చెపడతా మన్నారు. కార్యక్రమం లో రోలుగుంట మండల టీడీపీ అధ్యక్షులు చంద్ర, చంద్రమౌళి,రావికమతం మండల టీడీపీ అధ్యక్షులు కోమటి శంకర్ రావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజన కొండనాయుడు, బుచ్చయ్యపేట మండల టీడీపీ అధ్యక్షులు ఎం వి వి సత్యనారాయణ, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెలు సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు తమరణ దాసు, పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## హై వే వెంచర్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

### రానున్న రోజుల్లో మరిన్ని సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు: డాక్టర్ చింతాడ హేమారావు

**విశాఖపట్నం /సీతమ్మధార: (జయ జయహే)**



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణలో భాగంగా ' మట్టి గణపయ్యను ప్రతిష్టిద్దాం - పర్యావరణాన్ని కాపాడుదాం ' అనే నినాదంతో సీతమ్మధార లో ఉన్న హై వే వెంచర్స్ కార్పొరేట్ కార్యాలయంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. సంస్థ చైర్మన్ మరియు సినీ నిర్మాత డాక్టర్ చింతాడ హేమారావు ఆధ్వర్యంలో సుమారు 5 వేలు మంది భక్తులకు వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథులుగా జనసేన రాష్ట్ర నాయకులు డాక్టర్ బొడ్డేపల్లి రఘు, మాజీ కార్పొరేటర్ కతారి అనిల్ కుమార్ రాజు హాజరై స్థానికులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాలుష్య రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా మట్టి వినాయకులనే పూజించి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. పర్యావరణ హితమైన సంప్రదాయాన్ని ప్రోత్సహిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన హేమారావును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హేమారావు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి సంవత్సరం మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువ సామాజిక వేత్త నంబాల రాజేష్ కుమార్,సంస్థ డైరెక్టర్లు మరియు స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మట్టి వినాయకుడే ప్రకృతికి రక్షణ

### కడియపులంకలో మట్టి గణపతుల పంపిణీ

**రాజమహేంద్రవరం: జయ జయహే : సెప్టెంబర్ 13**

కడియపులంక మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని శ్రీ విశ్వేశ్వర హైటెక్ నర్సరీ అధినేత నక్కా కాశి, సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ చైర్మన్ బొరుసు సుబ్బారాయుడు, రాష్ట్ర ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాన్ని సత్యనారాయణ పిలుపునిచ్చారు.వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని కడియం మండలం కడియపులంక గ్రామదేవత శ్రీ ముసలమ్మ అమ్మవారి ఆలయం వద్ద హైటెక్ నర్సరీ యాజమాన్యం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగలు, సంప్రదాయాలను పాటించడంతో పాటు పర్యావరణ పరిరక్షణను సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల వల్ల నీరు, గాలి కాలుష్యం పెరిగే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. హిందూ సంప్రదాయంలో పంచభూతాలతో పాటు ప్రకృతిలోని జీవరాశులను ఆరాధించడం ద్వారా ప్రకృతిని గౌరవించే సందేశం ఉందన్నారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణానికి హాని కలిగించే విధానాలను విడనాడి, మట్టి గణపతులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో అమ్మిరాజు, మాజీ సర్పంచ్ గట్టి నరసయ్య, బీజేపీ మండల అధ్యక్షుడు బొరుసు బ్రహ్మణ్యం, పెద్దిరెడ్డి శ్రీనివాసు, డేగల రాము, పుల్లా నాగు, పుల్లా చిన సత్యనారాయణ, ఈలి బేబీ, కంఠంశెట్టి సత్యనారాయణ, మంగిని వీరస్వామి, ధర్మాసనం వెంకటరమణ, గట్టి అబ్బు, దొడ్డా విష్ణు, పుల్లా శ్రీనివాసు, పెనుమాక శేషగిరి, జంగా సోదరులు తదితరులు పాల్గొన్నారు.



## "కొబ్బరి బొండాలతో కొలువుదీరనున్న గణనాథుడు!"

**రాజమహేంద్రవరం: జయ జయహే సెప్టెంబర్ 13:**

రాజమహేంద్రి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 17వ వార్షిక గణేష్ ఉత్సవాల్లో భాగంగా పుష్కర ఘాట్ వద్ద లి9,999 కొబ్బరి బొండాలతో 'శ్రీ నందీశ్వర నారికేళ గణపతి'లిని ప్రతిష్ఠించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధి జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం పుష్కర ఘాట్ వద్ద జరిగిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు.

2010లో స్వర్గీయ జక్కంపూడి రామ్మోహన్‌రావు వ్యవస్థాపకునిగా రాజమహేంద్రి గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటైందని, అప్పటి నుంచి ఏటా విభిన్న రూపాల్లో పర్యావరణహిత గణపతులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వర్షాభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైతు సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ నందీశ్వర నారికేళ గణపతి రూపాన్ని ఎంపిక చేసినట్లు విజయలక్ష్మి చెప్పారు.

కొబ్బరికాయలోని మూడు గుర్తులు త్రినేత్రాలు, త్రిమూర్తులకు ప్రతీకలుగా భావిస్తారని, కొబ్బరి పెంకు అహంకారానికి, లోపలి జలం ఆనందానికి, తెల్లటి కొబ్బరి స్వచ్ఛతకు ప్రతీకలని వివరించారు. అహంకారాన్ని విడిచిపెట్టి స్వచ్ఛంగా, ఆనందంగా జీవించాలనే సందేశాన్ని ఈ రూపం అందిస్తుందని తెలిపారు. నందీశ్వరుడు పశుజాతికి ప్రతీక కావడంతో పాడిపంటలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.

చల్లా శంకరరావు మాట్లాడుతూ ప్రతి పూజా కార్యక్రమంలో ముందుగా వినాయకుడిని పూజించడం హిందూ సంప్రదాయమన్నారు. ఉత్సవాల్లో ప్రతిరోజూ అయ్యప్ప ఆలయం నుంచి ప్రసాదాలు తీసుకొచ్చి భక్తులకు పంపిణీ చేస్తామని తెలిపారు.

కమిటీ అధ్యక్షుడు బైర్రాజు ప్రసాదరాజు మాట్లాడుతూ జక్కంపూడి రామ్మోహన్‌రావు సంకల్పంతో హైదరాబాద్ గణేష్ ఉత్సవాల స్ఫూర్తితో రాజమహేంద్రిలో కమిటీ ఏర్పాటైందన్నారు. పర్యావరణహితంగా విభిన్న రూపాల్లో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కొమ్ముల సాయి, మంతెన కేశవరాజు, వక్కపాటి మురళి, వాకచర్ల కృష్ణ, మానే దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి ఆధ్వర్యంలో తుది పోలింగ్ స్టేషన్ జాబితా విడుదల

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



నిడదవోలు పురపాలక సంఘ సాధారణ ఎన్నికల్లో భాగంగా చైర్మన్, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించి తుది పోలింగ్ షెడ్యూల్ జాబితాను ఆదివారం (13.09.2026) ప్రచురించారు. మున్సిపల్ కమిషనర్ టి.ఎల్.పి.ఎస్.ఎస్. కృష్ణవేణి ఆధ్వర్యంలో ఎన్నికల ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.రాష్ట్ర ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు నిడదవోలు పురపాలక సంఘంలోని 32 వార్డులకు సంబంధించిన పోలింగ్ స్టేషన్‌ల తుది జాబితాను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచారు. మున్సిపల్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, జిల్లా కోర్టు/సబ్-కోర్టు, పబ్లిక్ లైబ్రరీ, పోస్టాఫీసు, సంబంధిత పోలింగ్ స్టేషన్లలో జాబితాను ప్రదర్శించారు.ప్రజలు తమకు సంబంధించిన వార్డు, పోలింగ్ స్టేషన్ వివరాలను పరిశీలించుకోవాలని అధికారులు సూచించారు.



## మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

**విజయనగరం (జయ జయహే)**

వినాయక చవితి సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ వద్ద విజయనగరం యూత్ పౌండేషన్ ఆధ్వర్యంలో 1500 మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు,పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతీ ఒక్కరు మట్టి విగ్రహాలనే పూజించాలని, చెరువులు, ప్రకృతిని కాపాడుకోవడం మన బాధ్యత ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు పర్యావరణాన్ని ఎక్కువగా హానికరమని పేర్కొన్నారు. పర్యావరణ హితాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని . గత ఆరు సంవత్సరాలుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు విజయనగరం యూత్ ఫౌండేషన్ అధ్యక్షులు షేక్. ఇల్తామాష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో యూత్ ఫౌండేషన్ సభ్యులు అశోక్, సాయి, నాగేశ్వరరావు శరత్, రఘు ,రాము, విజయ్ , వినయ్, శివ, సందీప్ తదితరులు పాల్గొన్నారు



## తెలుగు జాతి వైభవానికి ఒక వేదిక తెలుగు నాడు

**భీమవరం ; (జయ జయహే )**

తెలుగు జాతి గుండె చప్పుడు తెలుగునాడు మాస పత్రికను మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ మరియు కన్వీనర్ ఆవిష్కరించిన బొండా రాంబాబు, అనంతరం రాంబాబు,చవ్వా శ్రీనివాస సుబ్బారావు,పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని సాహిత్య సౌరభాన్ని భావితరాలకు చేరీచేసే లక్ష్యంతో తెలుగునాడు మాస పత్రిక వెలువడుతోందన్నారు. తెలుగు భాష పరిరక్షణకు ఒక ఉద్యమం, తెలుగు జాతి వైభవానికి ఒక వేదిక తెలుగు నాడు మాస పత్రిక అని అన్నారు. కోట్ల నాని, తటవర్తి బదరి మాట్లాడుతూ వెలుగులో ఉన్న సాహిత్యాన్ని మరింత ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు మరుగునపడిన రచనలను వెలికితీసి పరిచయం చేయడం 'తెలుగునాడు' బాధ్యతగా స్వీకరించిందన్నారు. కంచర్ల భాస్కరరావు, కారుమూరి బదరి, మానేపల్లి రవి చిన్నారావు, కురిశేటి సతీష్ , గుండు సుధీర్ మాట్లాడుతూ తెలుగులో ఎన్నో అందమైన పదాలు వాడుకలో లేకుండా పోతున్నాయని, సామెతలు, నుడికారాలు, ప్రాంతీయ పదాలు, వృత్తులకు సంబంధించిన పదజాలం, జానపద పదాలు ఇవన్నీ మన భాషా సంపదలో భాగమేనని అన్నారు. తెలుగునాడు మాస పత్రిక చేసే కృషికి మా వంతు సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. కార్యక్రమంలో కురిశెట్టి నాని, బొండాడ సుబ్బారావు,మానేపల్లి వెంకన్నబాబు,పున్నాని కనకారావు, తటవర్తి నారాయణ, కార్మురి బదరీ మరియు సభ్యులు పాల్గొన్నారు



## శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారిని దర్శించుకున్న బూరుగుపల్లి శేషారావు కుటుంబ సభ్యులు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలోని శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ శాసనసభ్యులు, నిడదవోలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ బూరుగుపల్లి శేషారావు కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సహాయ కమిషనర్ ఌ కార్యనిర్వహణాధికారి వి. హరి సూర్య ప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవి శంకర్ తదితరులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.

## వినాయక వేడుకలు.. భద్రతే తొలి ప్రాధాన్యం

### నిబంధనలు పాటిస్తూ ప్రశాంతంగా నిర్వహించాలి: ఎస్పీ డి. నరసింహ కిషోర్

**రాజమహేంద్రవరం, జయ జయహే : సెప్టెంబరు 13:**



తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్,వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంతంగా, సురక్షితంగా, పర్యావరణహితంగా నిర్వహించాలని సూచించారు. ఉత్సవ కమిటీలు ప్రభుత్వ నిబంధనలు, పోలీసుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు.వినాయక మండపాల ఏర్పాటుకు స్త్రుఅవంష్ట్రబ-ఝఙ.అవ్ ద్వారా సింగిల్‌విండో విధానంలో ఆన్‌లైన్ అనుమతులు పొందాలని, ఎలాంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. మండపాల వద్ద సిసి కెమెరాలు, తగిన లైటింగ్, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, నీటి డ్రమ్ములు, ఇసుక బకెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు.అధికారిక విద్యుత్ కనెక్షన్ మాత్రమే వినియోగిస్తూ, అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తో ఎంసిబి , ఆర్‌సిసిబి , ఎర్తింగ్, నాణ్యమైన వైరింగ్ ఏర్పాటు చేయించాలన్నారు. విద్యుత్ తీగలకు మండపాలు కనీసం రెండు మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు.ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిబంధనలకు లోబడి సౌండ్ సిస్టమ్ వినియోగించాలని, డిజె లకు పూర్తిగా అనుమతి లేదని స్పష్టం చేశారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కోర్టులు, ప్రార్థనా మందిరాలకు 100 మీటర్ల పరిధిలో లౌడ్‌స్పీకర్లు వినియోగించరాదన్నారు. మట్టి విగ్రహాలు, పర్యావరణహిత రంగులను ప్రోత్సహించాలని కోరారు.ఊరేగింపుల్లో వాలంటీర్లు తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలని, పోలీసుల అనుమతించిన మార్గాల్లోనే ఊరేగింపులు నిర్వహించాలని సూచించారు. నిమజ్జనాన్ని పోలీసులు సూచించిన ప్రదేశాలు, సమయాల్లో నిపుణులైన ఈతగాళ్లు, వాలంటీర్ల సహకారంతో నిర్వహించాలన్నారు. మండపాల వద్ద మద్యం, మత్తు పదార్థాలు, అశ్లీల ప్రదర్శనలు, బాణసంచా, ఆయుధాలు, రెచ్చగొట్టే నినాదాలు పూర్తిగా నిషేధమన్నారు. ఇతర మతాలు, కులాలు, వ్యక్తుల మనోభావాలను దెబ్బతీసే ఫ్లెక్సీలు, పోస్టులు, సోషల్ మీడియా వదంతులకు దూరంగా ఉండాలని సూచించారు. ఊరేగింపులు, నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు, అంబులెన్స్‌ల రాకపోకలకు అంతరాయం కలిగించరాదని, వాహనాలపై పరిమితికి మించి ప్రయాణించకూడదన్నారు. ప్రమాదకర నీటి ప్రాంతాలకు మహిళలు, చిన్నారులు, వృద్ధులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసులకు లేదా డయల్ 112కు, జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్ 9490760794కు సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

For a pure tomorrow.. జయహే

# వినాశనకర పరిశ్రమలు మాకొద్దు

**పర్యావరణానికి హాని కలిగితే ఊరుకోం ఉద్యమిస్తాం**

**సంతబొమ్మాలి వైయస్సార్సీపి డిమాండ్**

**టెక్కలి సెప్టెంబర్ 13 జయ జయహే**




శ్రీకాకుళం జిల్లా సంత బొమ్మాలి మండలం ప్రాంతాల్లో పర్యావరణానికి హాని చేసే వినాశనకర పరిశ్రమల కు అనుమతించి ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత ప్రజలము ఊరుకోమని ఉద్యమిస్తామని స్థానిక జడ్పిటిసి , వైయస్సార్సీపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పాల వసంత రెడ్డి హనుమంతు నాయుడుపేట కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో కెమికల్ తోకూ డిన కోరమండల్ ఫెర్టిలైజర్స్ కెమికల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగితే సుమారు పది కిలోమీటర్ల పరిధిలో గాలి నీరు భూమి కరుషితమవుతుందని ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం ప్రమాదం ఉందని వసంత రెడ్డి తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజల అభిప్రాయ సేకరణ లేకుండా ఎటువంటి పరిశ్రమలను స్థాపిస్తే ఊరుకునేది లేదని ప్రజలంతా కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రజలు వ్యతిరేకిస్తున్న పరిశ్రమలకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు ఎందుకు ఆసక్తి చూపుతున్నారో తెలియడం లేదన్నారు, 80 వేల కోట్ల రూపాయల భారత్ పెట్రోలియం పరిశ్రమను నెల్లూరు జిల్లాకు తరలించారని విమర్శించారు, ఈ ప్రాంతంలో 4 వేల 300 ఎకరాల ఉప్పు భూములు, 3వేల 300 ఎకరాల తంపర భూములు, 500 ఎకరాల అటవీ భూములు, 12వేల ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, ముందుగా ప్రభుత్వ భూములను పరిశ్రమల కోసం వినియోగించాలని తదుపరి రైతులు భూముల కోసం ఆలోచించాలని వసంత రెడ్డి సూచించారు. సంతబొమ్మాలి మండలం మూలపేట గ్రీన్ పోర్ట్ 60 శాతం నిర్మాణ పనులు పూర్తికావచ్చాయని ప్రస్తుతం నత్త నడకలో నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు, పోర్టు లో పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితులు కొనసాగుతున్నయని అన్నారు, అయితే వినాశనకర పరిశ్రమలకు తామెప్పుడూ వ్యతిరేకమేనని మరోసారి వసంత రెడ్డి ప్రజల తరపున స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి మండల పార్టీ అధ్యక్షుడు బి మోహన్ రెడ్డి, న క్క భీమారావు, పా ల మహేశ్వర్ రెడ్డి, మార్పు నాగభూషణరావు, అంగ అప్పారావు, పి ధనంజయ రెడ్డి, పంగ రామయ్య తదితరులు పాల్గొన్నారు.




## సద్భావ టీమ్ ఆధ్వర్యంలో 500 మందికి ఉచితంగా వినాయక వ్రత సామగ్రి పంపిణీ

**చోడవరం, సెప్టెంబర్ 13,,జయ జయా హే**

సి డి వి ఎం కమ్యూనిటీ పౌండేషన్ వారు చోడవరం కమ్యూనిటీ ఫ్రిడ్జ్ వద్ద ఆదివారం వినాయక చవితి సందర్భంగా సద్భావ టీమ్ ఆధ్వర్యంలో ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలు పువ్వులు పత్రి వినాయక వ్రతకల్పం పుస్తకాలు పంపిణీ చేశారు. 500 మందికి పైగా భక్తులకు పూజ సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పరిసర ప్రాంత ప్రజలకు, భక్తులకు ఉచితంగా వినాయక వ్రతానికి కావలసిన సమస్త పూజా సామాగ్రిని అందజేశారు. పర్యావరన పరి రక్షణలో భాగంగా సమాజ శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని తాము చేస్తున్న సేవా కార్యక్రమంలో భాగంగా వీటిని పంపిణీ చేసినట్టు నిర్వాహకులు తెలిపారుఈ సందర్భంగా సద్భావ టీమ్ ప్రతినిధులు మాట్లాడుతూ... పర్యావరణ హితంగా వినాయక చవితి జరుపుకోవాలని, పూజకు కావలసిన పత్రి, పువ్వులు, మట్టి విగ్రహం మరియు వ్రత పుస్తకాన్ని ఒకే చోట అందించి ప్రజలకు సేవ చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సేవా కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం విజవంతం కావడానికి తమ వంతు సద్భావ టీమ్ తో సహాయ సహకారాలు అందించిన ' గార్మెంట్స్' యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సద్భావ టీమ్ సభ్యులు ప్రెసిడెంట్ పి.ఎస్.ఎన్. మూర్తి , సెక్రెటరీ కుమారి, ట్రెజరర్ అపర్ణ గారు, కరణం నరసింహమూర్తి , పుట్టా శ్రీనివాస్ , రేపాక రమేష్ , విజయ , పి ఎస్ కే గుప్తా , పొట్నూరు సాయి కిరణ్ , అప్పలరాజు , హరీష్ , ఆత్మీయులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వినాయకునికి వెండి కిరీటం బహుకరణ

**మాడుగుల సెప్టెంబర్ 13 జయ జయహే**

మాడుగుల మండలం ఎంకోడూరు శ్రీ మోదకొండమ్మ వారి ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ వినాయక స్వామికి సుమారు 750 గ్రాములు గల కిరీటాన్ని కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రాజపూర్ గ్రామస్తులు కోరుకొండ సూర్యరావు, కోరుకొండ వెంకట శ్రీనివాసరావు,కే గంగాధర్ జగదీష్ బాబు దంపతులు గ్రామంలో దాతలుఅందజేశారు. ఈ మొత్తాన్ని ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు.



## ఆశ్రమానికి మట్టి విగ్రహం బహుకరణ

**పాడేరు సెప్టెంబరు 13 జయ జయహే**

పాడేరులో గల బాలసదనం అనాధాశ్రమానికి వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయకుని విగ్రహాన్ని పాడేరు కి చెందిన వాసవి క్లబ్ ప్రతినిధులు య శ్రీనివాసరావు శిరీష దంపతులు ఆదివారం అందజేశారు. చిన్నారుల్లో ఆనందం చూడాలని గణపతి పట్ల వారిలో భక్తి ప్రవర్తలు పెంపొందించాలన్న లక్ష్యంతో అనాధాశ్రమంలో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని విగ్రహాన్ని అందించినట్లు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణలో భాగంగా

# మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

**విజయనగరం, సెప్టెంబరు 13 జయ జయహే**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా విజయనగరం ఆర్యవైశ్య సంఘం, జిల్లా ఆర్యవైశ్య సంఘం మరియు కన్యకా పరమేశ్వరి అమ్మవారు దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మట్టి వినాయక ప్రతిమలు, వినాయక వ్రతకల్ప పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రవ్వా శ్రీనివాస్ మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలనే ఉద్దేశంతోనే ప్రతి ఏటా ఈ పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. ఈ ఏడాది మట్టి వినాయక విగ్రహాలతో పాటు పూజా విధానం తెలిపే వ్రతకల్ప పుస్తకాలను భక్తులకు ఉచితంగా అందజేసినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను విడిచిపెట్టి, మట్టి వినాయకులనే పూజించి ప్రకృతిని కాపాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి కాపుగంటి రవి, కన్యకా పరమేశ్వరి దేవస్థానం పాలకమండలి సభ్యులు కాపుగంటి ప్రకాష్, కుమ్మరిగుంట శ్రీనివాసరావు, వాసవి చారిటీ గ్రూప్ అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్, డిమ్స్ రాజు, వెల్ఫేర్ అసోసియేషన్ కోశాధికారి ఉపేంద్ర, చాంబర్ ఆఫ్ కామర్స్ కోశాధికారి బొడ్డు శ్రీనివాసరావు, పి.వి.రామారావు, కలగర్ల నారాయణరావు, వజ్రపు కృష్ణారావు, సముద్రాల నాగరాజు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఉప లోకాయుక్త పి. రజిని

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 13, జయ జయహే**

శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజిని కుటుంబ సమేతంగా ఆదివారం శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థానం ఈఓ బి.కె. వెంకటేశులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి దర్శనం, ఆలయ విశిష్టతలను వివరించారు. ఉప లోకాయుక్త పి. రజిని శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని, శ్రీ జ్ఞానప్రసూనాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు ఆమెకు వేద ఆశీర్వచనం అందించారు. దేవస్థానం అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ లోకేష్ బాబు, ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్స్పెక్టర్ హరి యాదవ్, లోకాయుక్త అధికారి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు విజయం

**జాతీయ జట్టుకు శ్రీకాళహస్తి క్రీడాకారులు దర్శన్, హేమంత్ ఎంపిక**

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 13, జయ జయహే**

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్కాపురం పట్టణం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో సెప్టెంబర్ 11, 12, 13 తేదీల్లో నిర్వహించిన 11వ ఆంధ్ర రాష్ట్ర అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ క్రీడా పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన క్రీడాకారులు కె. దర్శన్, ఎం . హేమంత్ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి జట్టుకు శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కావడం పట్ల పట్టణంలోని క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడాకారుల ప్రతిభను అభినందిస్తూ శ్రీకాళహస్తి మండలం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తూ శ్రీకాళహస్తికి, చిత్తూరు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

## వినాయక ఉత్సవాల పేరుతో హద్దులు వద్దు

**విజయనగరం జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్**

**విజయనగరం జయజయహే**




వినాయక చవితి ఉత్సవ నిర్వాహకులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మితిమీరి ప్రవర్తించారాదని జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ కమిటీ సభ్యులకు సూచించారు . ఉత్సవాలను ప్రశాంతయుతంగా, భక్తి, శ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. వినాయక మండపాల ఏర్పాటు, విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక కార్యక్రమాలు, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాల్లో తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు, పోలీస్ శాఖ సూచనలు పాటించాలన్నారు. మండపం ఏర్పాటు చేసే ముందు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని అనుమతులకు ఎలాంటి ఫీజు లేదన్నారు. మండపం వద్ద నిర్వాహకులు అందుబాటులో ఉండేలన్నారు . భక్తుల రద్దీని నియంత్రించేందుకు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు . అత్యవసర అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు .లౌడ్ స్పీకర్లు, డీజేలు ఉపయోగించేటప్పుడు నిర్దేశించిన సమయాలు మరియు శబ్ద పరిమితులను పాటించాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా నిర్వహణ ఉండరాదని ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చూడాలన్నారు . ఊరేగింపులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు .మహిళలు, చిన్నారులు మరియు వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. అసభ్యకర రెచ్చగొట్టే కార్యక్రమాలు చేయవద్దన్నారు . ప్రజల్లో భయాందోళనలు కలిగించే సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయరాదు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటించాలని అత్యవసర సమయాల్లో 100 కు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.



## కివీ పండుతో

# ఆరు ఆరోగ్య ప్రయోజనాలు

పండ్లు, కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వాటిలో మన శరీరానికి కావాల్సిన విటమిన్‌లు, ఖనిజాలు, ఫైబర్‌లు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండ్లలో కివీ పండు కూడా ఒకటి. ఈ పండును తరచూ మన డైట్‌లో భాగం చేసుకోవడం ద్వారా చర్మ సంరక్షణ నుంచి వ్యాధినిరోధకత వరకు ఆరు రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. మరి ఆ ప్రయోనాలేమిటో చూద్దాం.. తరచూ కివీ పండును తింటే.. ఈ ఆరు ఆరోగ్య ప్రయోజనాలు మీ వెంటే..!

### 1. నాజూకైన చర్మం
కివీ పండులో విటమిన్ సి పుష్కలంగా ఉ ఒంటుంది. ఈ విటమిన్ సి చర్మాన్ని ఆరోగ్యంగా, నాజూకుగా ఉంచుతుంది. వంద గ్రాముల కివీ పండు తింటే ఒక రోజులో దేహానికి అవసరమైన సి విటమిన్‌లో అధిక శాతం లభిస్తుంది. అంతేగాక కివీ పండులో యాంటీ ఆక్సిడెంట్స్ ఉండి చర్మం పాలిపోకుండా, ముడుతలు పడకుండా కాపాడుతుంది. పచ్చి కివీ ముక్కలు తినడం ద్వారా గానీ, లేదంటే నేరుగా చర్మానికి రాసుకోవడం ద్వారా గానీ ఈ ప్రయోజనాన్ని పొందవచ్చు.

### 2. అదుపులోకి బ్లడ్ ప్రెషర్
ప్రస్తుతం ఈ భూమ్మీద లక్షలాది మంది ప్రజలు అధిక రక్తపోటు సమస్యతో బాధపడుతున్నారు. వారికి కివీ ఫ్రూట్ ఒక వరం లాంటిది. ఎందుకంటే కివీ పండులో పొటాషియం కంటెంట్ పుష్కలంగా ఉ ఒటుంది. ఈ పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచడానికి తోడ్పడుతుంది. అంతేగాక రక్తపోటు కారణంగా వచ్చే పక్షవాతం, టైప్–2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

### 3. జీర్ణశక్తి పెరుగుదల
కివీ పండు జీర్ణశక్తికి కూడా బాగా పనిచేస్తుంది. ప్రతి 100 గ్రాముల కివీ పండులో 3 గ్రాముల ఫైబర్ ఉంటుంది. అంతేగాక ప్రతిరోజూ మానవ శరీరానికి అవసరమైన ఫైబర్‌లో 12 శాతం అందుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఫైబర్‌లు సునాయాసమైన, ఆరోగ్యకరమైన జీర్ణశక్తికి దోహదం చేస్తాయి. కివీ పండులో ఎంజైమ్‌లను కరిగించే ప్రొటీన్ ఉంటుంది. దాంతో ఎంజైమ్‌లు అత్యంత వేగంగా అమైనో ఆసిడ్స్‌గా మారుతాయి.

### 4. ఆరోగ్యకరమైన నిద్ర
కివీ పండులో సెరటోనిన్ వంటి నిద్రకు ఉ పకరించే పదార్థాలు ఉన్నాయి. అందువల్ల తరచూ కివీ పండు తినేవారికి హాయిగా నిద్ర పడుతుంది. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి ఈ పండు మంచి మేలు చేస్తుంది. కివీ పండులోని పదార్థాలు సహజసిద్ధమైన నిద్రకు తోడ్పడుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

### 5. రోగనిరోధక శక్తి పెంపు
ముందే చెప్పుకున్నట్టుగా సి విటమిన్‌కు కివీ పండు ఒక మంచి వనరుగా ఉ ఒటుంది. ఈ విటమిన్ రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కూడా బాగా పనిచేస్తుంది. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్స్ శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ క్రమబద్ధీకరణకు తోడ్పడుతాయి. ఫ్రీ రాడికల్స్ వల్ల శరీరానికి నష్టం జరగకుండా కివీ పండ్లు కాపాడుతాయి.

### 6. పటిష్టమైన ఎముకలు
ఎముక పుష్టి ప్రస్తావన వచ్చినప్పుడు మనకు కివీ పండు అనేది అసలు స్ఫురణకే రాదు. కానీ వాస్తవానికి కివీ పండులో ఎముకలను బలోపేతం చేసే ఫోలేట్ ఉంటుంది. ఈ ఫోలేట్ ఎముక నిర్మాణానికి తోడ్పడుతుంది. ఎముకల గట్టి తనానికి కివీలోని విటమిన్ కే కూడా బాగా ఉపకరిస్తుంది. అందుకే గర్భిణిల డైట్‌లో కివీ పండును చేర్చడం చాలా ముఖ్యం.

# రాగులతో బరువు తగ్గించుకోండిలా?



**రాగులని ఫింగర్ మిల్లెట్స్ అని కూడా ఉన్నారు. ఇందులో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మిల్లెట్స్ని తీసుకుంటే రక్తంలో చక్కెరస్థాయిలు తగ్గించడం నుంచి బరువు తగ్గడం, గుండె ఆరోగ్యం వరకూ చాలా బెనిఫిట్స్ ఉన్నాయి. రాగులని మొలకెత్తించి తినడం వల్ల ఎన్నో హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. ముఖ్యంగా, ఎముకలు, బ్రెయిన్ డెవలప్‌మెంట్‌లో కూడా హెల్ప్ చేస్తాయి. మొలకెత్తిన రాగులని తీసుకుంటే ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఎవరైనా మిల్లెట్స్‌ని ఆహారంగా తీసుకుంటే వారికి పోషకాలు లభిస్తాయి.**

### మిల్లెట్స్‌లోని పోషకాలు..
మిల్లెట్స్‌లో ఎన్నో పోషకాలు ఉంటాయి. ఇందులో ఫైబర్, కాల్షియం, కార్బోహైడ్రేట్స్, విటమిన్స్ వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ముఖ్యంగా ఎండాకాలంలో రాగులు తినడం మంచిది. వీటిలోని శీతలీకరణ గుణం వేసవి తాపాన్ని చల్లబరుస్తుంది. అలాగే ఇది షుగర్ ఉన్నవారికి బెస్ట్ ఫుడ్. దీని వల్ల రక్తంలో చక్కెరని కంట్రోల్ చేయడం సాధ్యమవుతుంది.

### రాగి జావ స్పెషల్

### బ్లడ్ షుగర్ లెవల్స్..
షుగర్ ఉన్నవారికి రాగుల మొలకలు ఓ వరమనం చెప్పొచ్చు. ఇందులో పాలిఫెనాల్స్, డైటరీ ఫైబర్ కంటెంట్ ఉంటుంది. కాబట్టి, ఇది షుగర్ లెవల్స్‌ని కంట్రోల్ చేయడంలో మరింత ఎఫెక్టివ్‌గా పనిచేస్తుంది. రాగుల్లోని పీచు రక్తంలో చక్కెర శోషణని నెమ్మదిస్తుంది. దీంతో చక్కెర స్థాయిలు కంట్రోల్ అవుతాయి. కాబట్టి, కచ్చితంగా షుగర్ ఉన్నవారు రాగి మొలకల్ని తింటే షుగర్ కంట్రోల్ అవుతుంది.

### బరువు తగ్గడం..
మొలకెత్తిన రాగుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది వెయిట్‌లాస్‌కి మేలు చేస్తుంది. ఈ మొలకలు తీసుకోవడం వల్ల కడుపు నిండుగా ఉంటుంది. దీంతో కేలరీలని తగ్గిస్తాం. అతిగా తినరు. దీంతో బరువు తగ్గుతారు. పోషకాలు కూడా శరీరానికి అందుతాయి.

### రక్తహీనత దూరం..
మొలకెత్తిన రాగుల్ని తీసుకుంటే రక్తహీనత సమస్య దూరమవుతుంది. రాగుల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచడంలో సాయపడుతుంది. మిల్లెట్స్‌ని ఆహారంలో చేర్చుకోవచ్చు. రక్త ప్రసరణ పెరుగుతుంది. దీంతో పాటు ఐరెన్ లెవల్స్ పెరిగి రక్తహీనత దూరమవుతుంది. ఇది మీ బాడీని హెల్దీగా, శక్తివంతంగా చేస్తుంది.

### కొలెస్ట్రాల్ తగ్గడం..
హై కొలెస్ట్రాల్ స్థాయిలను కంట్రోల్ చేయడంలో స్ప్రౌటెడ్ మిల్లెట్స్ చాలా బాగా పనిచేస్తాయి. రెగ్యులర్‌గా రాగుల మొలకల్ని తీసుకుంటే కొలెస్ట్రాల్ కంట్రోల్ అవుతుంది. ఎందుకంటే, ఇందులో అమైనో యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి లివర్ ఫ్యాట్‌ని తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. అమైనో యాసిడ్స్ కొలెస్ట్రాల్‌ని కంట్రోల్ చేయడంలో సాయపడతాయి. దీంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

**మిల్లెట్స్ స్మూతీ..**
**పోషకాలు, రిఫ్రెష్ స్మూతీ కోసం మొలకెత్తిన రాగులని ఇష్టమైన పండ్లు, పెరుగు, కొద్దిగా తేనెతో కలిపి స్మూతీలా చేసుకుని తాగండి.**
**సలాడ్ : మొలకెత్తిన మిల్లెట్స్‌ని తాజా కూరగాయలు, ఆకుకూరలతో కలపి హెల్దీ సలాడ్‌లా తయారుచేసుకోవచ్చు.**
**ఇడ్లీ దోశ : వీటితో చక్కగా ఇడ్లీ, దోశల్లా తయారు చేసుకుని తినొొచ్చు. దీని వల్ల మిల్లెట్స్‌లోని హెల్దీ బెనిఫిట్స్ అందుతాయి.**



### జీర్ణక్రియకి మేలు..
ఎండాకాలంలో జీర్ణవ్యవస్థ మందగించి గ్యాస్, అసిడిటీ, కడుపునొప్పి వంటి సమస్యలు వస్తాయి. వేయించిన ఆహార పదార్థాలు, హెవీ ఫుడ్ తీసుకున్న తర్వాత గ్యాస్, అసిడిటీ, కడుపునొప్పి సమస్యలొస్తాయి. దీనికోసం మీరు బ్రేక్‌ఫాస్ట్‌లో మొలకెత్తిన మిల్లెట్స్ తీసుకుంటే జీర్ణవ్యవస్థ బలోపేతం అవుతుంది. దీని వల్ల జీర్ణ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. రాగి మొలకల్లో ఎక్కువ ఫైబర్ కంటెంట్ ఉంటుంది. ఇది జీర్ణక్రియని ప్రోత్సహించి జీర్ణ సమస్యల్ని దూరం చేస్తుంది.

### ఎలా వాడొచ్చు..
మీ డైట్‌లో మొలకెత్తిన రాగులని వాడడం చాలా ఈజీ. దీనిని సలాడ్స్, స్మూతీల్లా చేసుకోవచ్చు. బ్రేక్‌పాస్ట్‌లో యాడ్ చేయొచ్చు.

### గంజి..
ఈ మొలకల్ని మీరు నీరు, పాలతో ఉడికించి పంచదార, చిటికెడు ఉప్పు కలిపి తీసుకోవచ్చు. మీకు ఇష్టమైతే పండ్లు, డ్రై ఫ్రూట్స్ యాడ్ చేయొచ్చు.

## ఈ ఆయుర్వేదిక చిట్కాతో 30 రోజుల్లోనే

# శరీరంలోని కొలెస్ట్రాల్ మాయం



శరీరంలో కొలెస్ట్రాల్ ఏర్పడకుండా ఉండేందుకు ఎన్నో మార్గాలున్నాయి. ఆయుర్వేద వైద్యం అనేది ఒక పురాతన వైద్య విధానం. వేదాల్లో ఎన్నో సమస్యలకు పరిష్కారాలు కూడా ఉన్నాయి. కాకపోతే త్వరిత గతిన ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలను పొందాలన్న ఆశతో ఎక్కువ మంది అల్లోపతి వైద్యాన్ని ఆశ్రయిస్తుంటారు. అల్లోపతితో పోలిస్తే ఆయుర్వేదానికి సంబంధించిన ఏ మందులు తీసుకున్నా సరే సైడ్ ఎఫెక్ట్స్ తక్కువగా వస్తాయి. ఆయుర్వేదంలో కొలెస్ట్రాల్ శరీరంలో పేరుకుపోకుండా ఒక సింపుల్ చిట్కా ఉంది. భోజనానికి ముందు ప్రతిరోజు ఒక స్పూన్ అల్లం పొడిలో చిటికెడు రాతి ఉప్పును వేసి కలుపుకుని తింటే ఎంతో మంచిది. లేదా దానిని నీటిలో కలుపుకుని తాగినా మంచి ఫలితం ఉంటుంది. భోజనానికి ముందు ఇది తీసుకుంటే శరీరంలో కొలెస్ట్రాల్ ఏర్పడకుండా అడ్డుకుంటుంది. కడుపు ఉబ్బరాన్ని కూడా తగ్గించడంతో పాటు మెరుగైన జీర్ణక్రియను అందిస్తుంది. రాతి ఉ ప్పు అంటే శుద్ధి చేయని ఉప్పులో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం అధికంగా ఉంటాయి. ఇవి ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేయడానికి ఉ పయోగపడతాయి. అంతే కాకుండా మొత్తం జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. అల్లంలో కూడా ఎన్నో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థకు సంబంధించిన చిన్న చిన్న సమస్యలను కూడా తగ్గిస్తాయి. అల్లంలో జింజరాల్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు కూడా ఉ ంటాయి. ఇది కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. అల్లం రక్తంలోని మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచి చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఇది రాతి ఉప్పులోని ముఖ్యమైన ఖనిజాలతో కలిస్తే కొలెస్ట్రాల్‌ను సమర్థవంతంగా అడ్డుకుంటుంది. కాబట్టి రాతి ఉప్పు, అల్లం పొడిని వేసి ప్రతి రోజు భోజనానికి ముందు తినడం అలవాటు చేసుకోండి. ఇలా తినడం కాస్త కష్టంగానే ఉ ంటుంది. అలాంటప్పుడు కాస్త గోరు వెచ్చని నీటిలో ఈ మిశ్రమాన్ని కలిపి తాగితే మంచి ఫలితం ఉంటుంది. అల్లం, రాతి ఉప్పు కలిపి తీసుకోవడం వల్ల పేగుల్లో గ్యాస్ట్రిక్ ఏర్పడడం తగ్గుతుంది. జీర్ణక్రియ లక్షణాలు కూడా బాగా మెరుగుపడతాయి. జీర్ణ రసాలు కూడా ఉత్పత్తి అవుతాయి. పొట్టలోని ఆమ్లాలు అన్నీ సమతుల్యం అవుతాయి. ఇది పోషకాలను బాగా గ్రహిస్తుంది. ప్రతి భోజనానికి 15 నిమిషాల ముందు గోరువెచ్చని నీటిలో ఒక స్పూన్ అల్లం పొడి, చిటికెడు రాతిపొడి వేసి బాగా కలుపుకుని ఆ నీటిని తాగేయాలి. ఇలా తాగిన 20 నిమిషాల తర్వాత భోజనాన్ని తినాలి. ఇలా చేస్తే 30 రోజుల్లోనే మీకు మంచి ఫలితాలు కనిపిస్తుంది. అంతే కాకుండా మీ శరీరంలోని కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది.

# అర్ధరాత్రి హత్య




(ప్రతాప్)

బయట ఢిల్లీ నగరం ఎప్పటిలాగే పరుగులు తీస్తోంది. కానీ ఉత్తర ఢిల్లీలోని లాహోరీ గేట్ ప్రాంతంలోని ఓ హోటల్ గదిలో మాత్రం అర్ధరాత్రి నిశ్శబ్దం రక్తపాతంగా మారింది. కొన్ని గంటల క్రితం వరకు సాధారణంగా కనిపించిన ఆ గది... తెల్లవారేసరికి హత్యా స్థలంగా మారిపోయింది. హోటల్ ప్రిన్స్‌లో బుధవారం రాత్రి 28 ఏళ్ల శివాని, ఆమె భర్త ప్రకాశ్ గది తీసుకున్నారు. ప్రకాశ్ వయసు 29 సంవత్సరాలు. రాజస్థాన్‌లోని ఫలోడీకి చెందిన అతడు టీ దుకాణం నిర్వహించేవాడు. బిహార్‌లోని సమస్తిపూర్‌కు చెందిన శివాని ఢిల్లీలోని ఓ అందాల కేంద్రంలో పనిచేస్తోంది. దాదాపు ఆరు నెలల క్రితమే వీరిద్దరికీ వివాహమైంది. వివాహం తర్వాత కొంతకాలానికే వారి మధ్య విభేదాలు మొదలయ్యాయని పోలీసులు తెలిపారు. బుధవారం ప్రకాశ్ ఢిల్లీకి వచ్చాడు. హోటల్‌లో గది బుక్ చేశాడు. అనంతరం శివాని అక్కడికి చేరుకుంది.

**ఆ తర్వాత ఏం జరిగింది? ఇదే ఇప్పుడు దర్యాప్తులో కీలక ప్రశ్న.**

పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, రాత్రి దంపతుల మధ్య కుటుంబ సంబంధిత విషయంపై వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగింది. పరిస్థితి అదుపు తప్పింది. ప్రకాశ్ కత్తితో శివానిపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమెకు అనేక కత్తిపోట్లు తగిలాయి. అనంతరం ప్రకాశ్ కూడా విషపదార్థం తీసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఘటనకు ఖచ్చితమైన కారణం, మొత్తం పరిణామ క్రమం ఇంకా దర్యాప్తులోనే ఉన్నాయి.

**రాత్రి గడిచిపోయింది. ఉదయం వచ్చింది. కానీ హోటల్ గదిలో నుంచి ఎలాంటి స్పందన లేదు.**

హోటల్ సిబ్బంది గదిలో ఉన్న వారిని సంప్రదించేందుకు ప్రయత్నించారు. తలుపు తట్టారు. ఫోన్ చేశారు. అయినా స్పందన రాలేదు. అనుమానం పెరగడంతో అదనపు తాళంతో తలుపు తెరిచారు.

**తలుపు తెరిచిన వెంటనే కనిపించిన దృశ్యం వారిని షాక్‌కు గురిచేసింది.**

శివాని తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో కనిపించింది. ప్రకాశ్ కూడా అపస్మారక స్థితిలోనే ఉన్నాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందింది. ఇద్దరినీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శివానిని అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. ప్రకాశ్‌కు చికిత్స కొనసాగుతోంది; అతని పరిస్థితి స్థిరంగా ఉందని పోలీసులు తెలిపారు.

**ఇక పోలీసుల దర్యాప్తు మొదలైంది.**

గదిలో ఉన్న కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆత్మహత్య లేఖ కనిపించలేదు. ఘటనకు ముందు, తరువాత ఏం జరిగిందో తెలుసుకునేందుకు గదిలోని ఆధారాలను సేకరిస్తున్నారు. హోటల్ సిబ్బందిని ప్రశ్నించడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని నిఘా కెమెరాల దృశ్యాలను కూడా పరిశీలిస్తున్నారు. శివాని మృతదేహాన్ని శవపరీక్షకు పంపించారు.

**అసలు ప్రశ్న మాత్రం ఇంకా మిగిలే ఉంది. ఆ రాత్రి గదిలో జరిగిన వాగ్వాదం ఎందుకు ప్రాణాంతకంగా మారింది?**

కుటుంబ వివాదమే కారణమా? ముందే ఏదైనా పథకం ఉందా? కత్తిని ప్రకాశ్ ముందుగానే తీసుకువచ్చాడా? లేక హోటల్ గదిలోనే పరిస్థితి ఒక్కసారిగా హింసాత్మకంగా మారిందా?

ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

ప్రకాశ్ ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత అతడిని పోలీసులు విచారించనున్నారు. అతని వాంగ్మూలం, నిఘా కెమెరాల దృశ్యాలు, న్యాయవైద్య ఆధారాలు, హోటల్ సిబ్బంది చెప్పే వివరాలు---ఇవన్నీ కలిపితే ఆ రాత్రి జరిగిన సంఘటనల పూర్తి చిత్రాన్ని బయటకు తీసుకురావచ్చని అధికారులు భావిస్తున్నారు.

**కొన్ని గంటల క్రితం ఒక దంపతులు అడుగుపెట్టిన హోటల్ గది...**

తెల్లవారేసరికి ఒక ప్రాణాన్ని కోల్పోయింది. మరో ప్రాణం ఆసుపత్రి మంచంపై ఉంది.

ఒక కుటుంబ వివాదం ఎక్కడ మొదలైందో పోలీసులకు తెలుసుకోవాలి. అది ఎలా హింసగా మారిందో తెలుసుకోవాలి. చివరకు ఆ గదిలో అసలు ఏం జరిగిందో నిర్ధారించాలి.

మూసివున్న ఆ గది తలుపు వెనుక దాగిన నిజం ఇప్పుడు దర్యాప్తు ఆధారాల ద్వారా ఒక్కొక్కటిగా బయటకు రావాల్సి ఉంది.

(మీడియా వార్తల ఆధారంగా)



### ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌లో

# హానికర రసాయనాలు ఉంటాయి

## మట్టి వినాయకుని ప్రతిమలను పంపిణీ చేస్తున్న ఎస్సై అల్లూరి రెడ్డి

**పెద్దకూరపాడు,సెప్టెంబర్13 (జయ జయహే)**

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ లో జిప్సం,గంధకం,మెగ్నీషియం వంటి హానికర రసాయనాలు ఉంటాయని, భావితరాలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని బహుమతిగా అందించాలంటే పర్యావరణహిత మార్గాలను అనుసరించాల్సిన అవసరం ఉందని పెదకూరపాడు సబ్ ఇన్స్పెక్టర్ ఏరువ చిన్న అల్లూరి రెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ నిర్వాహకులు జవ్వాది సతీష్ సహకారముతో మట్టి వినాయకుని ప్రతిమలను ఆదివారం సంస్థ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్సై అల్లూరి రెడ్డి మాట్లాడుతూ రసాయన విగ్రహాలకు బదులుగా మట్టి గణనాథులను పూజించి భావితరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలన్నారు.జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ పర్యావరణ గణపతి ప్రకృతికి ప్రణతి అని రెండు సంవత్సరాలు గా మట్టి గణనాథుల ప్రతిమలకు సహకారం అందించిన జవ్వాది సతీష్ అభినందనీయులని అన్నారు.పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో జనచైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, ప్రతినిధులు గుడిపూడి రాజశేఖర్,రామినేని శ్యామ్ తదితరులు ఉన్నారు.



### తెలంగాణలో...

# 1.51 లక్షలకు పైగా కేసుల పరిష్కారం

## మూడవ జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

## 3,896 సైబర్ ఫ్రాడ్ కేసుల సెటిల్‌మెంట్

## న్యాయవ్యవస్థ, పోలీసుల సమన్వయంతో కేసుల భారం తగ్గింపు

## కేసుల పరిష్కారంలో హైదరాబాద్, ఖమ్మం, గద్వాల యూనిట్లు టాప్

**(జయ జయహే)**

తెలంగాణ వ్యాప్తంగా నిర్వహించిన మూడో జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో 3,896 సైబర్ మోసాల కేసులతో సహా మొత్తం 1.51 లక్షలకు పైగా రాజీపడదగిన (కాంపౌండబుల్) క్రిమినల్ కేసులను పరిష్కరించినట్లు తెలంగాణ పోలీస్ శాఖ ఆదివారం వెల్లడించింది. ఈ సెటిల్‌మెంట్ల ద్వారా సైబర్ నేరాల బాధితులకు ఏకంగా రూ.42.29 కోట్లు తిరిగి అందజేయడం గమనార్హం.రాష్ట్రవ్యాప్తంగా కోర్టులలో కేసుల భారాన్ని తగ్గించడంతో పాటు, కక్షిదారుల సమయం, డబ్బు ఆదా చేసే లక్ష్యంతో ఈ లోక్ అదాలత్ నిర్వహించారు. ఇరు పక్షాల మధ్య రాజీ, పరస్పర అంగీకారం ద్వారా వివిధ రకాల కేసులను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం దోహదపడింది. ఈ అవకాశాన్ని ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు ప్రోత్సహించారు. ఇందుకోసం పరిష్కారానికి అర్హత ఉన్న కేసులను గుర్తించి, ఇరువర్గాలకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. డీజీపీ కార్యాలయం విడుదల 1,51,164 కేసులుచేసిన ప్రకటన ప్రకారం, సెప్టెంబర్ 3న ప్రారంభమైన కేసుల పరిష్కార ప్రక్రియ సెప్టెంబర్ 12న ముగిసింది. ఈ సమయంలో మొత్తం 1,51,164 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 21,843 ఎఫ్ఐఆర్ కేసులు, 1,404 విపత్తు నిర్వహణ కేసులు, 61,052 పెట్టీ కేసులు, 62,969 మోటార్ వాహన చట్టం కేసులు ఉన్నాయి. ప్రత్యేకించి, 3,896 సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారం ద్వారా బాధితులకు రూ.42.29 కోట్ల మొత్తాన్ని తిరిగి చెల్లించారు.కేసుల పరిష్కారంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ యూనిట్లలో హైదరాబాద్ (15,944 కేసులు), ఖమ్మం (10,955 కేసులు), గద్వాల (8,469 కేసులు), వరంగల్ (8,404 కేసులు), మల్కాజ్‌గిరి (8,109 కేసులు) ముందున్నాయి. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా జడ్జిలు, మేజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు , పోలీస్ కమిషనర్లు, జిల్లా ఎస్పీల సమష్టి కృషితో ఇంత పెద్ద సంఖ్యలో కేసులను పరిష్కరించడం సాధ్యమైందని డీజీపీ తెలిపారు. ఈ సమన్వయంతో కూడిన ప్రయత్నం వల్ల లోక్ అదాలత్ గొప్ప విజయాన్ని సాధించిందని ఆయన పేర్కొన్నారు.



### కాంగ్రెస్‌ను

# వీడేది లేదు

## మళ్లీ మంత్రిని అవ్వడం ఖాయం

## కాంగ్రెస్ అధిష్టానం ఏది పార్టీలో చేరొద్దని బతిమాలుతుంది

## కొండా సురేఖ సెన్సేషనల్ కామెంట్స్

**(జయ జయహే)**

కాంగ్రెస్‌ను వీడటంపై కొండా మురళి సంచలన వ్యాఖ్యలు చేశారు. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి కానీ మా రక్తంలో, మా కుటుంబంలో కృతజ్ఞత ఉందన్నారు. తాము కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్ అయ్యాక తొలిసారి ఇవాళ వరంగల్‌లో తమ కార్యకర్తలో కొండా దంపతులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన మురళి.. ఎన్ని రోజులు బతికామన్నది ముఖ్యం కాదని ఎలా బతికామన్నదే ముఖ్యం అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం అని చెప్పారు.

**సారీ చెప్పమన్నారు**

పదవుల మీద నాకు వ్యామోహం లేదని కొండా సురేఖను సారీ అని ఒక్క మాట చెప్పమన్నారని అన్నారు. కానీ నా పదవి ఉంటే ఉండనీ. పోతే పోనీ అని నా భార్య సారీ చెప్పలేదన్నారు. కొండా సురేఖను గెలిపించడంలో రాహుల్ గాంధీ పాత్ర ఉందని రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే మా లక్ష్యం అన్నారు. మాట కోసం నిలబడతామని పదవులు ఇవాళ వస్తాయి.. రేపు పోతాయన్నారు. నా శరీరంలో నాలుగు బుల్లెట్లు ఉన్నాయి. బుల్లెట్లున్నా నేను బతికే ఉన్నా. కొండా సురేఖది నాది ఒక్కటే మాట. మా బిడ్డది మాత్రం వేరే మాట, వేరే బాట అన్నారు. రేవంత్ రెడ్డి, మహేశ్ గౌడ్ కష్టాల నుంచి వచ్చినవారే కార్పొరేషన్ ఎన్నికల్లో ఇక్కడ తిరుగుతాం. గెలుపు గుర్రాలకు టికెట్లు మేమే ఇస్తామన్నారు.



### రోశయ్య దూరదృష్టి వల్లే

# మిగులు బడ్జెట్

## సీఎం రేవంత్ రెడ్డి

## ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ

## ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ

## హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తా

## ఆర్యవైశ్య ఆత్మగౌరవ సభలో రేవంత్ రెడ్డి

**(జయ జయహే)**

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారన్న సీఎం రేవంత్ రెడ్డి పేదరికం ఉన్నా ఆర్యవైశ్యులు కడుపులో దాచుకుంటారని స్పష్టం చేసారు. ఆయన ఇవాళ హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నముఖ్యమంత్రి ఆర్యవైశ్య భవన నిర్మాణానికి సహకరిస్తానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

భవిష్యత్ ఉంటుందని రోశయ్య ఆనాడే సలహా ఇచ్చారు : ఆర్యవైశ్యులు ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఆర్యవైశ్య సోదరులు పేదలకు ఉదారంగా అప్పు ఇస్తారని, తాను సుదీర్ఘ కాలం రాజకీయాల్లో రాణిస్తానని మాజీ సీఎం రోశయ్య గుర్తించారని పేర్కొన్నారు. అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడుతుంటే ఆవేశం తగ్గించుకోవాలని చెప్పారని, ఆవేశానికి ఆలోచన తోడయితే భవిష్యత్ ఉంటుందని రోశయ్య సలహా ఇచ్చారని గుర్తు చేసుకున్నరు. రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారు కానీ దూషించరని కొనియాడారు. రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఉండాలని నిర్ణయించామని, హైదరాబాద్‌తోనే తన అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య చెప్పేవారని సీఎం వెల్లడించారు.

ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలం : ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారం ఆర్యవైశ్యులకే ఇచ్చామని అన్నారు. ఆర్థికలావాదేవీల్లో సలహాల కోసం ఆర్యవైశ్యులనే అడుగుతారని, సీఎంలు ఎంతమంది మారినా ఆర్థికమంత్రిగా రోశయ్యనే ఉన్నారని, రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని కొనియాడారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలమని సూచించారు. ఆర్యవైశ్యుల బిడ్డ గాంధీ అంటే ప్రపంచంలో తెలియనివారు లేరని, ఆంధ్ర రాష్ట్ర కోసం ప్రాణత్యాగం పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్యుడేనని గుర్తు చేశారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1,
BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com